ఆదివారం
02-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 11
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రజా సంక్షేమమే చైనా కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం

చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) ఆవిర్భావం ప్రజల కోసమే జరిగిందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిందని రవాండా నిపుణులు, ఐక్యరాజ్యసమితి (ఐరాస) మాజీ రాయబారి జోసెఫ్ ముటాబోబా అన్నారు. కిగాలీలో జిన్హువా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చైనా కమ్యూనిస్టు పార్టీ నమ్మకానికి మారుపేరని ఆయన శ్లాఘించారు.

2 లో

20 నుంచి పార్లమెంటు

▸ కీలక బిల్లులపై కేంద్రం కసరత్తు ▸ సహకరించాలని మంత్రి జోషి విజ్ఞప్తి

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ఆగస్టు 11 వరకు కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈసారి సమావేశాలు తొలుత పాత భవనంలో ప్రారంభమై... మధ్యలో కొత్త భవనంలోకి మారతాయని ఇటీవల అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఫలవంతమైన చర్చలకు సహకరించాల్సిందిగా ప్రతిపక్షాలకు జోషి విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ సర్కారును గద్దె

- మిగతా 2 లో

మహా విషాదం

డివైడర్‌ను ఢీకొని బస్సు బోల్తా, మంటలు

▸ 25 మంది సజీవ దహనం
▸ సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేపై దుర్ఘటన
▸ డ్రైవర్‌పై కేసు - మానవతప్పిదమే ప్రమాదానికి కారణం
▸ కేంద్రం రూ.2లక్షలు, మహారాష్ట్ర రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

నాగపూర్: ఓ ప్రైవేటు బస్సు ప్రయాణం 25 మంది కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. ప్రయాణికుల పాలిట మృత్యు శకటంగా పరిణమించింది. మహారాష్ట్రలోని బుల్ధానా జిల్లాలో నాగపూర్-ముంబై 'సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వే'పై ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైంది. బస్సు పూర్తిగా మంటలకు ఆహుతయ్యింది. 25 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. తొలుత స్తంభాన్ని, డివైడర్‌ను ఢీకొన్న బస్సు ఒక్కసారిగా పల్టీ కొట్టగా అందులో

- మిగతా 2 లో

ఖరీఫ్ సాగేనా ?

▸ జులై వచ్చినా అదను కాని పొలాలు
▸ వానాకాలంలోనూ తగ్గని ఉష్ణోగ్రతలు
▸ తాజా వర్ష సూచనతో రైతుల్లో ఆశలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జులై వచ్చినా పంటల సాగుకు సరిపడా వర్షాలు లేవు. ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గడం లేదు. దీంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. అసలు ఈ ఏడాది ఖరీఫ్ పంటలు సాగు సాధ్యమేనా? అనే పరిస్థితి నెలకొంది. రైతన్న నెల రోజులుగా ఆకాశం వైపు చూస్తూ ఏరోజుకారోజు వీడుతున్న మబ్బులు చూసి నీరసపడుతున్నాడు. తొలకరి జల్లులు మినహా ఏ జిల్లాలోనూ భారీ వర్షం కురిసిన దాఖలా లేదు. ఏప్రిల్ నుంచి ఎండలు మండుతున్నాయి. వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం సహజమే కానీ జూన్, జులై నెలల్లో కూడా ఎండ తీవ్రత అదే స్థాయిలో ఉండటంతో ఖరీఫ్ సాగుపై నీలినీడలు అలుముకున్నాయి. సాధారణంగా రోహిణీకార్తె ప్రారంభమైన తర్వాత వర్షాలు కురవడం, నువ్వులు, పెసర, అపరాలు వంటి పునాస పంటలు సాగు చేస్తారు. కానీ ఈ ఏడాది పునాస సాగు మచ్చుకైనా కానరావడం లేదు. అక్కడక్కడా కొద్ది మేర సాగు చేసినా ఆ పంటలను బతికించుకోవడం కష్టంగా మారింది. రాష్ట్రంలో ఐఎండీ నివేదిక ప్రకారం జూన్‌లో 37శాతం వర్షలోటు నమోదైంది. ఫలితంగా జూన్‌లో ఖరీఫ్ సాగు ఐదు శాతానికి మించలేదు. వర్షాభావ పరిస్థితులను అంచనా వేసిన వ్యవసాయశాఖ ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని భారీగా తగ్గించింది. గతేడాది 96.41లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యంగా పెట్టుకోగా, దానిని ఈ సంవత్సరం 89.37లక్షల ఎకరాలకు కుదించింది. జూన్ నెలాఖరుకు ఎనిమిది లక్షల ఎకరాలు సాగులోకి రావాల్సి ఉండగా, ఇప్పటికి 3.95లక్షల

- మిగతా 2 లో

విద్యార్థి అనుమానాస్పద మృతి

కడప జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థలో ఘటన
మృతదేహంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల ఆందోళన
పాఠశాల గుర్తింపు రద్దు : డీఈఓ

రాజకీయ లబ్ధికే యూసీసీ

▸ విపక్షాల ఐక్యతతో ఎన్‌డీఏకు దడ
▸ ఎన్నికల వేళ బీజేపీ కుట్రలు, కుయుక్తులు
▸ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి పౌరస్మృతి వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తెరపైకి తీసుకువచ్చారని, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు కుట్ర చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ), జీఎస్‌టీని తీవ్రంగా వ్యతిరేకించిన మోదీ...ప్రధాని పదవి చేపట్టిన తర్వాత ఆ రెండింటినీ భుజాలకెత్తుకున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో గల మగ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కార్యదర్శి వర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్, ఈటీ నరసింహతో కలిసి నారాయణ శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. విపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడం, దేశవ్యాప్తంగా మోదీ సర్కారు ప్రతిష్ఠ దిగజారడంతో ఎలాగైనా వచ్చే ఎన్నికల్లో గెలవాలని ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని ప్రధాని మోదీ తెరపైకి తెచ్చారని నారాయణ విమర్శించారు. ఒక దేశంలో రెండు చట్టాలు ఏమిటంటూ మోదీ సర్కారు వితండవాదం చేస్తోందని, దేశ ఆవిర్భావ చరిత్ర కాషాయదళానికి ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా ప్రజలంతా దేశ స్వాతంత్ర్యం కోసం ఐక్యంగా పోరాటం చేశారని నారాయణ గుర్తుచేశారు. బ్రిటీషు పాలకులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బీజేపీ పాత్ర లేదన్నారు. స్వాతంత్ర్యం అనంతరం అన్ని మతాలు, కులాలు, సంస్కృతులు, సంప్రదాయలకు అనుగుణంగా రాజ్యాంగం రాసుకున్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుయుక్తులు, పార్లమెంట్ ఎన్నికలప్పుడు కుట్రలు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ పాకులాడుతోందని వ్యాఖ్యానించారు. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలను కర్నాటక ప్రజలు తిప్పికొట్టారని గుర్తుచేశారు. దేశం సర్వనాశనమైనా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని, మతాల మధ్య విద్వేషం నింపుతున్నారని నారాయణ మండిపడ్డారు. మణిపూర్ అల్లర్లకు మోదీనే బాధ్యుడన్నారు. మణిపూర్‌లో మారణహోమం జరుగుతున్నా మోదీ పట్టించుకోవడం లేదన్నారు. మణిపూర్‌లోని అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు మోదీ సర్కార్ పన్నిన కుట్ర కారణంగానే హింస కొనసాగుతోందని విమర్శించారు. ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని నారాయణ పిలుపునిచ్చారు. మణిపూర్ పర్యటనకు వెళ్లిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని రెచ్చగొట్టేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించారన్నారు. బీహార్ వేదికగా ఏకతాటిపైకి వచ్చిన విపక్షాలను విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదన్నారు. గవర్నర్ వ్యవస్థ కేంద్రానికి తొత్తుగా మారిందని విమర్శించారు. రాష్ట్రమంత్రి బాలాజీని తమిళనాడు గవర్నర్ రవి బర్తరఫ్ చేయడమేమిటని ప్రశ్నించారు. ఢిల్లీలో తన పెత్తనాన్ని నిలుపుకునేందుకు మోదీ సర్కారు తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తామని నారాయణ స్పష్టంచేశారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఢిల్లీలో సీపీఐ జాతీయ సమితి సమావేశాలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. సీపీఐ, సీపీఐ(ఎం) కూటమిగా ఉన్నాయని, రాష్ట్ర ఎన్నికల్లో, దేశ వ్యాప్తంగా ఉమ్మడిగానే పోటీ చేస్తామన్నారు.

శ్రీలంకకు నారాయణ: శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ 80వ మహాసభలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని, సీపీఐ తరపున తాను సభలకు హాజరువుతున్నట్లు నారాయణ చెప్పారు.

వేళ్లూనుకున్న విచ్ఛిన్నకర భావజాలం

ప్రమాదంలో దేశం
మెఫీ సెమినార్‌లో పరకాల

విశాలాంధ్ర-హైదరాబాద్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పడిపోయినంత మాత్రాన ప్రమాదం తొలగిపోబోదని, దేశాన్ని విచ్ఛిన్నం చేసే భావజాలం బలంగా ఉన్నదని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ భావజాలం ఒక మత్తు లాంటిదని, దానిని 10-15 ఏళ్లలో సమాజం నుండి నిర్మూలించేంత వరకు పనిచేయకపోతే దేశం విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. మన దేశం, సమాజం, ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక విలువలు, విద్యా బోధన అన్నీ సంక్షోభంలో ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎన్నడూ లేనంత నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం, పేదరికం దేశంలో పెరిగాయన్నారు. హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఇండియా(మెఫీ) అధ్వర్యంలో 'సంక్షోభంలో భారత గణతంత్రం-విశ్లేషణ' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో పరకాల ప్రభాకర్ ప్రసంగించారు. మెఫీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో మెఫీ మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్, ట్రస్టీ ఆలపాటి సురేశ్, వై.నరేందర్ రెడ్డి, కె.విరాహత్ అలీ తొలుత పరకాలను సన్మానించారు. భారతదేశం ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక సంక్షోభాలపై ఇటీవల ఆయన రచించిన 'ద క్రూక్డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా' అనే పుస్తకంలోని అంశాలను వివరించారు. కరోనాలో వలస కూలీల వెతలు, గంగానదిలో శవాలు తేలడం, రూపాయి విలువ దిగజారడం, మణిపూర్ మారణహోమం కొనసాగడం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుదల వంటి వార్తలను ప్రజలు రెండు రోజుల తరువాత మరిచిపోతున్నారని ఆయన అన్నారు. మీడియా పనికిరాని లక్ష వార్తలు ప్రచురించి అసలు వార్తను మరుగున పరుస్తున్నదని, తద్వారా దేశం మొద్దు బారే పరిస్థితికి చేరుకున్నదన్నారు. ప్రధాని మోదీని అమెరికా అధ్యక్షుడు కౌగిలించుకున్న అంశాన్ని కూడా ప్రచారానికి వాడుకునే సంస్కృతి వచ్చిందని వాపోయారు. తనను ప్రతిపక్షాలు 91 సార్లు తిట్టాయనే నిర్దిష్టమైన సమాచారం ప్రధాని వద్ద ఉన్నదని, కానీ కోవిడ్‌కు ఎంతమంది ప్రజలు, ప్రత్యేకించి వలస కూలీలు చనిపోయారనే సమాచారం లేదన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, మునుపెన్నడూ లేనంత మంది ఉపాధి హామీ పథకం కింద దరఖాస్తు చేసుకోవడమే ఇందుకు నిదర్శనమని పరకాల ప్రభాకర్ అన్నారు. 1990 నుండి మొట్టమొదటిసారిగా 75 మిలియన్ల మంది భారతీయులు పేదరికంలోకి వెళ్లారని, ప్రపంచ పేదరికంలో ఇది 60 శాతమని చెప్పారు. పౌష్టికాహార లోపం గల చిన్నారులలో ప్రపంచంలో ప్రతి వందమందిలో 25 మంది భారతీయులున్నారని వివరించారు. వ్యవసాయం నుండి నాలుగు కోట్ల మంది తప్పుకున్నారని వివరించారు. తొమ్మిదేళ్లలో ప్రైవేటు పెట్టుబడులు 23 శాతం నుండి 19 శాతానికి తగ్గిపోయాయని, ఆర్థిక వ్యవస్థ పెద్ద సంక్షోభంలో ఉన్నదన్నారు.

భారత్‌ను ఒక మతానికి చెందిన దేశంగా మార్చడానికి, దానిని జనబాహుళ్యం చేత ఒప్పించడానికి పెద్ద ప్రయత్నం జరుగుతోందని పరకాల ప్రభాకర్ అన్నారు. పాఠ్యపుస్తకాలు, సాహిత్యం, సినిమాలు, పుస్తకాలు, టీవీలు, పత్రికల ద్వారా పెద్దఎత్తున ప్రచారంలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చెట్లు నరికించేస్తాడు, వర్శిటీ భూములు తాకట్టు,ధారాదత్తం చేస్తాడు, ఈయన్ని ఖచ్చితంగా వీసీ చేయాలి సార్!

అర్జీదారుల జాతర

▸ జగనన్న సురక్ష ప్రారంభం
▸ మళ్లీ జగన్ ఫొటో ప్రచురణ
▸ తొలి రోజు 1,306 సచివాలయాల్లో నిర్వహణ
▸ ఆధార్‌కు ఫోన్ నంబరే అనుసంధానం
▸ ఫొటోలు... ఐరిష్ దూరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నుంచి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ అర్జీదారులు కోరిన ధ్రువ పత్రాలన్నీ ఇవ్వ లేదు. ఏకకాలంలో 11 రకాల పత్రాలను ఇస్తామంటూ ఏర్పాటు చేసిన జగన్ సురక్ష కార్యక్రమానికి ఆదిలోనే ఆటంకాలు ఎదురయ్యాయి. సచివాలయాల వారీగా ప్రత్యేక క్యాంపులతో పత్రాల జారీకి శ్రీకారం చుట్టారు. ఎక్కడ చూసినా గ్రామ/వార్డు సచివాలయాల్లో అర్జీదారుల జాతర నెలకొంది. ధ్రువ పత్రాల కోసం వారంతా బారులు తీరారు. తొలి రోజు 1,306 సచివాలయాల్లో ఈ ప్రక్రియ కొనసాగింది. తాజా ధ్రువ పత్రాలపై గతంలో తరహాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో ముద్రించడం చర్చనీయాంశంగా మారింది. 14,29,051 కుటుంబాలకు వారు ముందే సమాచారం అందించి, కావలసిన ధ్రువ పత్రాల అర్జీలను వలంటీర్లు స్వీకరించారు. ఒక అర్జీదారుడు తనకు కావలసిన పుట్టిన తేదీ, కుల, ఆదాయ ధ్రువ పత్రాలతో పాటు ఆధార్ కార్డుకు సెల్‌ఫోన్ అనుసంధానం ఇలా నాలుగైదు రకాలుగా గ్రామ/వార్డు సచివాలయాల వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేశారు. సచివాలయాలకు వెళ్లిన అర్జీ దారులకు, వారు కోరిన ధ్రువీకరణ పత్రాలలో మొక్కుబడిగా ఒకటి, రెండు మాత్రమే ఇచ్చి సరిపెడుతున్నారు. మిగిలిన పత్రాలు వరుస వారీగా త్వరలో వస్తాయంటూ వారిని తిప్పి పంపుతున్నారు. వారి సెల్ ఫోన్లకు సచివాలయాల నుంచి సమాచారం అందిస్తున్నారు. దీంతో అర్జీదారులకు దిక్కు తోచని స్థితి నెలకొంది. అటు పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం చాలా మంది విద్యార్థులు తాజా పత్రాల కోసం దరఖాస్తు చేశారు. అన్ని పత్రాలను ఒకే సారి ఇవ్వకపోవడం వల్ల వారు అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులకు వివిధ కోర్సుల ప్రవేశాల నిమిత్తం కుల, ఆదాయ, పుట్టిన తేది తదితర పత్రాలు లేనందున ఇబ్బందులకు గురవుతున్నారు. జగనన్న

- మిగతా 2 లో

ప్రజా సంక్షేమమే చైనా కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం

ఐరాస మాజీ అధికారి జోసెఫ్ ముటాబోబా

కిగాలీ: చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) ఆవిర్భావం ప్రజల కోసమే జరిగిందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిందని రవాండా నిపుణులు, ఐక్యరాజ్యసమితి (ఐరాస) మాజీ రాయబారి జోసెఫ్ ముటాబోబా అన్నారు. కిగాలీలో జిన్హువా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చైనా కమ్యూనిస్టు పార్టీ నమ్మకానికి మారుపేరని ఆయన శ్లాఘించారు. మంచి పాలన అందించడమే కాకుండా అభివృద్ధితో పాటు అనేక అంశాల్లో ఎంతో మెరుగుదలను సీపీసీ తీసుకు రాగలిగిందని చెప్పారు. చైనా ప్రజలకు ఆ పార్టీపై ఎంతో నమ్మకం ఉందని, సీపీసీకి మంచి ట్రాక్ రికార్డు ఉందని అన్నారు. ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించడమే కాకుండా సీపీసీ వారి సుఖ,సంతోషాలే ధ్యేయంగా పనిచేసిందని, చైనా ప్రజల జీవితాల్లో సంతోషాన్ని సీపీసీ నింపిందని తెలిపారు. చైనా ప్రజలకు మెరుగైన జీవనోపాధి, జీవితాన్ని అందించేందుకు కృషిచేసిందని చెప్పారు. సోషలిజం సిద్ధాంతాలు చైనా ప్రజలను ఆకట్టుకున్నాయన్నారు. మంచి నాయకత్వం, సమర్థ పాలన, ఆర్థికాభివృదిని సీపీసీ అందించిందని ముటాబోబా తెలిపారు. చైనా ఆధునికీకరణ, నవీకరణే సీపీసీ మిషన్ అని చెప్పారు. మార్పును స్వాగతించాలన్న చైనా నిర్ణయంతో అక్కడి సమాజం డైనమిక్‌గా మారగలిగిందని అన్నారు. వ్యవసాయ రంగంలోనే కాకుండా ఆహార భద్రత విషయంలో చెప్పుకోదగ్గ పురోగతిని చైనా సాధించిందన్నారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడమే కాకుండా శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ, పారిశ్రామిక రంగాలనూ అభివృద్ధి పథంలో సీపీసీ నడిపించిందని చెబుతూ 5జీ టెక్నాలజీ, సంప్రదాయ చైనా ఔషధాల గురించి ఆయన ప్రస్తావించారు. శాంతియుతంగా సాగిన అభివృద్ధి ద్వారా చైనా ఆధునికతను సంతరించుకోగలిగిందని, తద్వారా శాంతి-సుస్థిరతకు, అభివృద్ధికి మధ్య బంధానికి నిర్వచనాన్ని సీపీసీ చెప్పిందని అన్నారు. శాంతి, సౌభాగ్యం వంటివి చైనా సుస్థిరాభివృద్ధి గట్టి పునాది వేయగలిగాయని ముటాబోబా వెల్లడించారు.

సెప్టెంబరు 21-23 తేదీల్లో

గ్రీస్ కమ్యూనిస్టుల యువజనోత్సవం

ఏథెన్స్: గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) అనుబంధ కేఎన్ఈ 49వ మహోత్సవం సెప్టెంబరు 21, 22, 23 తేదీల్లో రాజధాని ఏథెన్స్‌లో జరగనున్నాయి. కమ్యూనిస్టు కవి నజీం హిక్మత్ స్ఫూర్తితో 'వెలుగు చీకటిని జయిస్తుంది' అనే నినాదంతో 'కేఎన్ఈ-ఒడిగిటిస్' ఉత్సవం నిర్వహిస్తారు. ఇదే క్రమంలో జులై, ఆగస్టు నెలల్లో గ్రీక్ నగరాల్లోనూ ఉత్సవాలు జరుగుతాయి. వీటిలో భాగంగా రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 21, 22, 23 తేదీల్లో ఏథెన్స్‌లోని త్రిట్సిస్ పార్కులో యువజన మహోత్సవాలు జరుగుతాయి. సెప్టెంబరు 23న నిర్వహించే ప్రధాన రాజకీయ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్‌సోంబస్, కేఎన్ఈ కార్యదర్శి థోడోరిస్ కౌట్సంటిస్ ఉంటారు. ప్రతి సంవత్సరం వలే ఈసారి కూడా గ్రీస్‌కు చెందిన ప్రఖ్యాత కళాకారులు సంగీత ప్రదర్శనలు ఇస్తారు. ఈ ఉత్సవాలకు 50ఏళ్ల చరిత్ర ఉంది. ఏడేళ్లు సాగిన సైనిక నియంత పాలన కుప్పకూలిన కొద్ది నెలలకు అంటే 1975, సెప్టెంబరులో కేఎన్ఈ, దాని అధికార ప్రతిక 'ఒడిగిటిస్' మొదటిసారి ఈ ఉత్సవాలు నిర్వహించాయి. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వీటిని పెద్దఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

కమ్యూనిస్టు వ్యతిరేకత చాటుతున్న ట్రంప్

అమెరికాలోకి అడుగుపెట్టనివ్వనని ప్రకటన

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కమ్యూనిస్టు వ్యతిరేకతను చాటుకుంటున్నారు. మతవాదాన్ని పెంచిపోషించేలా విద్వేషాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. 2024లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన వేళ క్రైస్తవ మతస్తులను తన వైపుకు తిప్పుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టులు, మార్క్సిస్టులపై విషం కక్కుతున్నారు. అసలు వారిని తమ దేశంలోకి అడుగు పెట్టనివ్వనని హామీలిస్తున్నారు. కమ్యూనిస్టు వ్యతిరేక వాదంతో రిపబ్లికన్లు, డెమొక్రటిక్ పార్టీ మధ్య నకిలీ విభజన రేఖలను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఈ రెండు పార్టీలు కమ్యూనిజాన్ని వ్యతిరేకిస్తాయి. ట్రంప్ తాజాగా వాషింగ్టన్‌లో ఫెయిత్ అండ్ ఫ్రీడమ్ సదస్సులో ప్రసంగిస్తూ 'అధికారంలోకి వస్తే మా ప్రభుత్వం క్రైస్తవులను ద్వేషించే కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, సోషలిస్టులను అమెరికాకు దూరంగా ఉంచుతుంది' అని ఉద్ఘాటించారు. అమెరికాలో ఉండే కమ్యూనిస్టులు, మార్క్సిస్టుల విషయంలో కొత్త చట్టాన్ని తెస్తామని చెప్పారుగానీ దాని గురించి వివరాలు ఇవ్వలేదు. కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు తమ దేశంలో అడుగు పెట్టేందుకు వీల్లేకుండా ఇమిగ్రేషన్, నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 212 (ఎఫ్)ను వినియోగిస్తానని ట్రంప్ చెప్పారు. 'కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు అందరినీ అమెరికాలోకి రానివ్వం. మన దేశానికి వచ్చే వారు మన దేశాన్ని ప్రేమించాలి' అని అన్నారు. ట్రంప్ చేసిన ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఈ పురాతన చట్టాన్ని వినియోగించి అమెరికాలోకి కమ్యూనిస్టు, మార్క్సిస్టు ఇమిగ్రెంట్లను నిషేధించడం సాధ్యమా? అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అలాగే కమ్యూనిస్టువాదానికి అమెరికాలో మద్దతు ఉండగా ట్రంప్ ఇటువంటి రాజకీయ సిద్ధాంతాలపై దృష్టి పెట్టడం వెనుక మర్మమేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుంటే, అమెరికా ఇమిగ్రేషన్ చట్టం ప్రకారం పౌరసత్వం లేక గ్రీన్ కార్డు పొందేందుకు కమ్యూనిస్టు పార్టీ సభ్యులకు అవకాశం ఉండదు. అదే విధంగా కమ్యూనిస్టు అనుబంధీకులకు ప్రవేశాన్ని నిషేధించే ఈ చట్టం 1918 నాటిది కాగా కమ్యూనిజం, అరాచకవాదం నుంచి ముప్పు క్రమంలో అప్పట్లో దీనిని అమల్లోకి తెచ్చారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలు నొక్కే ప్రయత్నం చేస్తోందని, ఫాసిజాన్ని ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. పౌర సంఘాల వేదిక సమన్వయ కర్త పి. చంద్రశేఖర్ అధ్యక్షతన భారత్ బచావో జిల్లా ప్రధాన కార్యదర్శి డా॥ పొన్నాడ శ్రీనివాస్ అధ్వర్యంలో శనివారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చర్చా గోష్ఠి నిర్వహించారు. స్వతంత్ర జర్నలిస్ట్ తులసిచంద్‌ను హత్య చేస్తామని బెదిరింపులు, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ పై కాల్పులు, ప్రజా ఉద్యమకారులపై ఉపా చట్టం పేరుతో చేస్తున్న దాడిని ఖండిస్తూ నాయకులు మాట్లాడారు. మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్, బీజేపీ దేశంలో రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదులకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాలని పిలునిచ్చారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎం. లక్ష్మి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను అణిచివేసేందుకు స్వదేశీ,విదేశీ జర్నలిస్టను సైతం సోషల్ మీడియా వేదికగా అసభ్యపదజాలంతో దూషించడం, హత్యలకు పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. జర్నలిస్ట్ నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వాల తప్పులను పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రచురిస్తున్న జర్నలిస్టులను హత్య చేస్తామని బెదిరింపులకు గురిచేయటం అన్యాయమన్నారు.

20 నుంచి పార్లమెంటు

(మొదటిపేజీ తరువాయి)

దించడానికి విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చిన వేళ...పార్లమెంటు సమావేశాలు మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది. ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని ప్రధాని మోదీ తెరపైకి తీసుకొచ్చిన వేళ పార్లమెంటు సమావేశం అవుతుంది. దీనిపై మోదీ సర్కారు ఇప్పటికే కసరత్తు చేపట్టింది. పార్లమెంటు సమావేశాలు మొత్తం 23 రోజులు, 17 సిట్టింగ్‌లో జరుగుతాయని జోషి ట్వీట్ చేశారు. ఈ సమావేశాల్లోనే కీలక బిల్లులు ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తోంది. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఈసారి ఆ జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే చాలా మంది పార్లమెంటు సభ్యుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. యూసీసీని కొన్ని పార్టీలు వ్యతిరేకిస్తుండగా... మరికొన్ని పార్టీలు మద్దతు ఇచ్చే యోచనలో ఉన్నాయి. దీంతోపాటు ఢిల్లీ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల విషయంలో తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ ఆర్డినెన్స్‌పై కేంద్రం, ఆప్ ప్రభుత్వం మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆప్ ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇవే చివరి వర్షాకాల సమావేశాలు. ఆ ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపే లక్ష్యంతో విపక్ష పార్టీలన్నీ కలిసికట్టుగా పోరాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ సమయంలో వివిధ అంశాల్లో అధికారపక్షం బీజేపీని విపక్షాలు గట్టిగానే ప్రశ్నించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. మణిపూర్ ఘర్షణలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

'మహా' విషాదం

(మొదటిపేజీ తరువాయి)

మంటలు చెలరేగాయి. బయటకు వచ్చేందుకు మార్గం లేక ప్రయాణికులంతా బస్సులోనే చిక్కుకుపోగా కొందరు కిటికీల అద్దాలు పగులగొట్టుకొని బయటకు రాగలిగారు. మిగతా వారు మంటల్లో చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ఇందతా క్షణాల్లో జరిగిపోగా తాము బిగ్గరగా కేకలు వేసినాగానీ అటుగా వెళ్లే వాహనాలేవీ ఆగలేదని ప్రాణాలతో బయటపడ్డ కొందరు ప్రయాణికులు చెప్పారు. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌తో పాటు ఎనిమిది మంది క్షేమంగా ఉన్నారు. బోల్తా పడిన నిమిషాల్లోనే మంటలు చెలరేగి బస్సు మొత్తం దగ్ధమైంది. గుర్తించలేని విధంగా కాలిపోయిన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. డ్రైవర్ కునుకు తీయడంతో వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ఈ ఘోరం జరిగిందని తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు బుల్దానా ఎస్పీ సునీల్ కడాస్నే తెలిపారు.

పూనే నుంచి నాగపూర్‌కు వెళ్లే విదర్భ ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ బస్సు నాగపూర్‌కు 130కిమీల దూరంలోని సింద్‌ఖడ్రేజా వద్ద పింప్లకుటా గ్రామం సమీపంలో శుక్ర-శనివారం మధ్యరాత్రి 1.30 గంటలప్పుడు ప్రమాదానికి గురైంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నాగపూర్‌కు బయల్దేరిన బస్సు రాత్రి భోజనం కోసం యావత్మల్ జిల్లాలోని కరంజలో కొద్ది సేపు ఆగింది. ఆపై గంటకు 60-70 కిమీల వేగంతో 150కిమీలు ప్రయాణించింది. బస్సు వేగం ప్రమాదానికి కారణం కాదని ఇది మానవతప్పిదమని ఎస్పీ వెల్లడించారు. డ్రైవర్ కునుకు తీయడంతో బస్సు కుడి వైపునకు వెళ్లి ముందు విద్యుత్ స్తంభాన్ని ఆపై డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టిందని, వెంటనే మంటలు చెలరేగాయని చెప్పారు. బస్సు టైరు పేలినట్లు డ్రైవర్ చెప్పగా అందుకు ఆధారాలు లభించలేదని అమరావతి ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్టీఓ) నివేదిక వెల్లడించింది. బస్సు ఎడమ వైపుకు తిరిగి పడటంతో తలుపు బిగుసుకుపోయి బయటకు వచ్చే దారి లేక ప్రయాణికుల్లో కొందరు కిటికీల అద్దాలను పగుల గొట్టి బయటకు వచ్చారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బస్సులో చిక్కుకొని బయటకు రాలేక అనేక మంది సజీవ దహనమయ్యారని, కళ్ల ఎదుటే వారు కాలిపోతుంటే ఏమీ చేయలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. డీజిల్ ట్యాంకు లేక ట్యాంకుకు డీజిల్ సరఫరా చేసే పైపు పేలడం వల్ల బస్సులో మంటలు చెలరేగి వుండవచ్చని న్యాయవాది సందీప్ చెప్పారు. రెప్పపాటులో అంతా జరిగిపోయిందని ప్రాణాలతో బయటపడిన ప్రయాణికులు చెప్పారు. తామంతా పెద్దగా కేకలు వేసినప్పటికీ అటుగా వెళ్లే వాహనాలు ఆగలేదని, తమకు సాయం చేసేందుకు ఎవరూ రాలేదని చెప్పారు. కిటికీల అద్దాలు బద్దలు కొట్టి బయటకు రాగలిగామని చెప్పారు. కాగా, డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించి, ఆపై మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని బుల్దానా కలెక్టర్ డాక్టర్ హెచ్‌పీ తుమ్మోద్ వెల్లడించారు.

ఘటనాస్థలికి షిండే, ఫడ్నవీస్

ఈ దుర్ఘటన గురించి సమాచారం తెలియడంతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శనివారం మధ్యాహ్నం ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. కాలిపోయిన బస్సు, సగం కాలిన బ్యాగులు, ప్రయాణికుల మొబైల్ చార్జర్లు ఆ ప్రాంతంలో అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటన దురదృష్టకరమని సీఎం అన్నారు. ఎక్స్‌ప్రెస్ వేపై ప్రయాణించే సమయంలో డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని షిండే సూచించారు. నాగపూర్-ముంబై సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటివరకు మానవ తప్పిదం వల్లే ఎక్స్‌ప్రెస్ వేపై అనేక దుర్ఘటనలు సంభవించినట్లు తెలిపారు. తాజా ప్రమాదాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. ఫడ్నవీస్ మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ వేపై ప్రమాదాల నివారణకు స్మార్ట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం వాహన-మానవ తప్పిదాల వల్లనే ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్పారు.

ఎక్స్‌గ్రేషియా ప్రకటన

ప్రమాదంలో చనిపోయిన 25 మంది కుటుంబాలకు రూ.5లక్షల నష్టపరిహారాన్ని సీఎం షిండే ప్రకటించారు. కేంద్రప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున పరిహారాన్ని పీఎంఓ ప్రకటించింది.

రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

'మహారాష్ట్ర, బుల్దానాలో బస్సు ప్రమాదంలో పిల్లలు, మహిళలతో పాటు 25 మంది చనిపోవడం కలచివేసింది. ఈ ఘటన హృదయ విదారకం. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ కూడా ట్విట్టర్ మాధ్యమంగా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు స్థానిక యంత్రాంగం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. హోంమంత్రి అమిత్‌షా హిందీలో ట్వీట్ చేశారు. ఈ ఘటన బాధాకరమని, ఇలాంటి సమయంలో బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నానని, మృతులకు సంతాపాన్ని ప్రకటిస్తున్నానని పేర్కొన్నారు. ప్రయాణికుల మరణం అత్యంత బాధాకరం, దురదృష్టకరమని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ట్వీట్ చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : శివసేన, ఎన్సీపీ, ఆప్

సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌పై ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. తాజా ప్రమాదం షిండే ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. గతేడాది డిసెంబరులో ఎక్స్‌ప్రెస్ వే ప్రారంభం కాగా ఇప్పటివరకు 300 మందికిపైగా వేర్వేరు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని ఠాక్రే తెలిపారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ప్రైవేటు వాహనాల వేగాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్స్‌ప్రెస్ వేపై ప్రమాదాల్లో సంభవించే మరణాలను 'దేవేంద్ర-వాసీలు' అని ప్రజలు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా మహారాష్ట్ర బుల్దానా ప్రమాద మృతులకు సంతాపాన్ని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ ఘటన విషాదకమని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తానని ఆయన ట్వీట్ చేశారు.

అర్జీదారుల జాతర

(మొదటిపేజీ తరువాయి)

సురక్ష ద్వారా కోరిన ధ్రువీకరణ పత్రాలు ఏకకాలంలో రాకపోవడంతో మళ్లీ లబ్దిదారులు పడిగాపులు పడాల్సి వస్తోంది.

రైస్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ఏదీ?

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా చాలామంది రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసినప్పటికీ, తొలి రోజు సచివాలయాల్లో వాటిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. గుంటూరు, విజయవాడ నగరాల్లోని సచివాలయాలకు వెళ్లిన అర్జీదారులకు చుక్కెదురైంది. రైస్ కార్డుల అర్జీలు తర్వాత చూస్తామంటూ సచివాలయ సిబ్బంది దాటవేస్తున్నారని అర్జీదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తలపెట్టిన జగనన్న సురక్షకు తొలి రోజే ఈ తరహా ఇబ్బందులు ఎదురవడంతో అర్జీదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, సచివాలయ వ్యవస్థ మధ్య సమన్వయం పూర్తిగా కొరవడిందనే విమర్శలున్నాయి. రైస్ కార్డులకు దరఖాస్తు చేస్తున్నప్పటికీ ఆన్ లైన్‌లో వాటి వివరాలను స్వీకరించలేదు. రైస్ కార్డుతోనే చాలా రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతాయి. ఆధార్ కార్డుకు కేవలం ఫోన్ నంబర్లను మాత్రమే అనుసంధానిస్తున్నారు.

దాని కోసం ముందస్తుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆధార్‌లోని ఫోటోలు, ఐరిష్, పేర్లు, చిరునామాలో మార్పులు, చేర్పులు చేపట్టడం లేదు. దీనివల్ల మళ్లీ ఆధార్‌లో ఫోటోలు, చిరునామాల మార్పుల కోసం బయట నెట్ సెంటర్లకు ప్రజలు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలు అన్నిటికీ ఏకకాలంలో అనుమతులు ఇచ్చి అర్జీదారులకు వేగవంతంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కుల, ఆదాయ పత్రాలకు అఫిడవిట్ మినహాయింపు

జగనన్న సురక్ష పథకంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు అఫిడవిట్ తప్పనిసరి అనే నిబంధనను ప్రభుత్వం ఎట్టకేలకు మినహాయించింది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకుగాను అఫిడవిట్ తప్పనిసరి అంటూ గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బంది మెలిక పెట్టడంతో అర్జీదారులు ఆందోళన చెందారు. ఈ విషయంపై వచ్చిన వార్త కథనాలతో ప్రభుత్వం స్పందించింది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకుగాను సంబంధిత అర్జీదారుల నుంచి ఎలాంటి అఫిడవిట్ తీసుకోవద్దంటూ సమాచారం ఇచ్చింది. దరఖాస్తుతో పాటు వారు కోరిన పాత ధ్రువ పత్రాల నకళ్లు జతచేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల కోసం సమర్పించే పంచనామాను సైతం మినహాయించారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా ఎలాంటి రుసుము లేకుండా ఈ పత్రాలను జారీ చేస్తున్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-కడప బ్యూరో : కడప జిల్లాలో విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఖాజీపేట మండలం కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్ రెడ్డి విద్యా సంస్థలో పులివెందులకు చెందిన సుహిత్ (11) ఆరవ తరగతి చదువుతున్నాడు. సుహిత్ శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు మృతదేహంతో పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఆందోళన చేస్తున్నా యాజమాన్యం స్పందించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలలోని ఫర్నీచర్‌ను పగలగొట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. పులివెందులకు చెందిన నాగరాజు, లలితల కుమారుడు సూహిత్ తెల్లవారు జామున కడుపునొప్పిగా ఉందని హాస్టల్ సిబ్బందికి చెప్పడంతో పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పులివెందులలో ఉన్న తల్లిదండ్రులు చెన్నూరులో ఉన్న తమ బంధువులకు సమాచారం అందించారు. వారు స్కూల్‌కు వెళ్లి సుహిత్‌ను పరామర్శించారు. అప్పటికే స్పృహకోల్పోయిన సుహిత్‌ను చికిత్స నిమిత్తం మోటారు సైకిల్‌పై 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెన్నూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే విద్యార్థి చికిత్స పొందుతున్న కొద్దిసేపటికే మృతి చెందాడు. సుహిత్ మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. తమ కుమారుడి ఒంటి పైన, వేలుకు, కడుపు, బొడ్డుపై గాయాలు ఉన్నాయని, ఉపాధ్యాయుడు కొట్టడం వల్లే విద్యార్థి చనిపోయాడని ఆరోపించారు. విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకుల అధ్వర్యంలో పాఠశాల వద్ద సుహిత్ మృతదేహంతో ఆందోళనకు దిగారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, యాజమాన్యం డౌన్ డౌన్ అంటూ ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, కడప, మైదుకూరు, ఖాజీపేటకు చెందిన ఎస్ఐలు, సీఐలు, ప్రత్యేక పోలీసు బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. కాగా, విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసుకొంటూ విద్యార్థుల ఆరోగ్యం గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కాయకష్టం చేసి పిల్లలు బాగుండాలని లక్షలాది రూపాయలు చెల్లిస్తే చివరికి విద్యార్థుల ప్రాణాలు ఇంటికి రావడం ఘోరమన్నారు. ఒకే క్యాంపస్‌లో అన్ని రకాల కోర్సులు నడుస్తూ ఉంటే అధికారులు నిమ్మకునీరెత్తి వ్యవహరించడం ఇందుకు నిదర్శనమన్నారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం కాకుండా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలనూ సందర్శించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని విద్యార్థి సుహిత్ మృతికి కారణమైన బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతికి సమాధానం చెప్పాలంటూ ఆందోళన చేస్తున్నా యాజమాన్యం స్పందించక పోవడంతో విద్యార్థి సంఘాల నాయకులు స్కూల్ భవనం అద్దాలను, ఫర్నీచర్‌ను, గేటు తాళాలను పగలగొట్టారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ భీష్మించారు. అనంతరం పోలీసులు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసు బందోబస్తు మధ్య సుహిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురితో విచారణ కమిటీ: ఈడీఓ

విద్యార్థి అనుమానాస్పద మృతికి కారణమైన బీరం శ్రీధర్ రెడ్డి స్కూల్ గుర్తింపును రద్దు చేస్తున్నట్టు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. గుర్తింపు రద్దు శనివారం నుంచే అమలులోకి వస్తుందన్నారు. విద్యార్థి మృతి ఘటనపై విచారణకు ఐదుగురు సభ్యుల కమిటీని నియమిస్తున్నట్టు చెప్పారు.

స్కూల్ యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలి : విద్యార్థి సంఘాలు

బీరం శ్రీధర్ రెడ్డి స్కూల్‌లో యాజమాన్యం పర్యవేక్షణ లోపం వలన ఉపాధ్యాయుడి దాడిలో విద్యార్థి మృతి చెందాడని, ఇది ముమ్మాటికీ స్కూల్ యాజమాన్య హత్యేనని తక్షణం వారిపై హత్య కేసు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు బాబు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిరుమలేష్, ఆర్‌వీఎస్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్, ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థి, యువజన సంఘాలు కలిసి బీరం శ్రీధర్ రెడ్డి స్కూల్ వద్ద చనిపోయిన విద్యార్థి మృతదేహంతో ధర్నా చేశారు. భారీగా మోహరించిన పోలీసులు ధర్నా చేస్తున్న వారిపై లాఠీఛార్జి చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి స్కూల్‌లో సుహిత్ అనే విద్యార్థిని ఉపాధ్యాయుడు తీవ్రంగా కొట్టడంతో అతను మృతి చెందాడని, దీనిలో స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం ప్రధాన కారణం అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు దోచుకుంటూ కూడా సరైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయకపోవటం వలన ఇలాంటివి జరుగుతున్నాయని విమర్శించారు.

విద్యాశాఖ అధికారులు కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలకు అమ్ముడుపోయి ఎన్ని ఘోరాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఖరీఫ్ సాగేనా ?

(మొదటిపేజీ తరువాయి)

ఎకరాల్లోనే విత్తనం పడింది. సాధారణ విస్తీర్ణంలో సగం కూడా విత్తనం పడకపోవడం వల్ల ఖరీఫ్ సాగు, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రైతు నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం రాయలసీమలో 27శాతం, కోస్తాంధ్రలో 37శాతం వర్షలోటు నమోదైంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో సగటు వర్షపాతానికి సగానికిపైగా వర్షలోటు ఉండగా, మిగిలిన జిల్లాల్లో 30శాతానికిపైగా ఉంది. కోనసీమ, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, బాపట్ల జిల్లాల్లో వర్షపాతం కాస్త మెరుగ్గా ఉంది. నాలుగు నెలల ఖరీఫ్ సీజన్‌లో అలస్యమనుకున్నా నెల రోజులు గడిచిపోయాయి. రానున్న రోజుల్లో సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంట కొంతైనా పండించే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా నాలుగు శాతం లోటు వర్షపాతం నమోదవుతుందన్న అంచనాతో వర్షాలు తక్కువగా కురిసే ప్రాంతాల్లో పంటలు వేసేందుకు అన్నదాతలు వెనుకాడుతున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం మరో నెల వర్షపాతం నివేదికల్ని చూసిన తర్వాతగానీ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక ప్రకటించలేమని చెపుతున్నారు. ఇలాంటి సమయంలో అమరావతి వాతావరణ కేంద్రం జారీ చేసిన తాజా వర్ష సూచన రైతుల్లో ఆశలను చిగురింపజేస్తోంది. ఏపీతో పాటు, కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో ట్రోపో ఆవరణంలో పడమటి గాలులు వీస్తున్న కారణంగా ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ, యానాం ప్రాంతాల్లో మూడు రోజులపాటు మోస్తరు నుంచి ఉరుములతో కూడిన వర్షాలు కురవచ్చని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గంటకు 30కిమీల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, వాటి ప్రభావమున్న ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వర్షాలు పడితే ఎండ తీవ్రత తగ్గుతుందని, పొలాలు అదనైతే విత్తనాలు ఎద పెట్టుకోవచ్చని భావిస్తున్నారు.

వేళ్లూనుకున్న విచ్ఛిన్నకర భావజాలం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టడం ద్వారా ఈ భావజాలానికి లోతైన పునాది వేస్తున్నారని ఆరోపించారు. పాఠ్యపుస్తకాలలో కొన్ని అధ్యాయాలను, శకాలను తొలగిస్తున్నారని, మన చరిత్ర, మన ఉనికి ఏమిటి అనే విషయాలపై భవిష్యత్తులో భిన్నమైన అభిప్రాయం కలిగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. స్వాతంత్ర్యోద్యమం, రాజ్యాంగ రచనతో సంబంధం లేని నాయకులు ఈ దేశం హిందువులదేనని, హిందువు కాని వారికి ఈ దేశంలో స్థానం లేదని, ఒకవేళ ఉండాలనుకుంటే ద్వితీయ, తృతీయ, నాలుగవ శ్రేణి పౌరులుగా బతకాలంటున్నారని చెప్పారు. ఈ భావజాలాన్ని రాజకీయ వ్యవస్థ ఆపలేదని, పౌరసమాజం, పాత్రికేయులు, అధ్యాపకులు, యూనివర్సిటీలు, రచయితలు, విద్యార్థులే ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. దేశంలో 18-20 శాతం ఉన్న మైనారిటీ సమూహానికి దేశ రాజ్య, శాసన, చట్ట, ఆర్థిక వ్యవస్థలో స్థానం లేకుండా చేశారని పరకాల ప్రభాకర్ అన్నారు. కేంద్రమంత్రి మండలిలో, బీజేపీ ఎంపీలలో ఒక్క ముస్లిం సభ్యుడు లేడని, బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్, యూపీ తదితర రాష్ట్రాల్లో ఒక్క ముస్లింకు టికెట్ ఇవ్వలేదన్నారు. ఒకప్పుడు లౌకికవాదినని చెప్పుకోకుండా భారత రాజకీయ సంభాషణలో పాల్గొనలేని పరిస్థితి ఉండేదని, నేడు అది హిందువునని చెప్పుకునే స్థితికి వచ్చిందన్నారు. దేశంలో ముస్లింలు లేకుంటే ఏమిటి...మనది హిందూ దేశమనే భావన ఐఐటీ, ఐఐఎం గ్రాడ్యుయేట్ న్యాయవాదులు, ఇతర విద్యావంతుల్లో బలంగా తిష్ఠవేసిందన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన నాడు దేశాన్ని మరో పాకిస్తాన్ చేయాలనుకుంటే నెహ్రూ, గాంధీ, పటేల్‌కు రెండు నిమిషాలు పట్టేది కాదని పరకాల అన్నారు. ఈ దేశాన్ని హిందు దేశంగా ప్రకటిస్తే మారణహోమం జరిగేదన్నారు.

ఉధృతమైన మతతత్వ శక్తి దేశాన్ని విభజించి, మారణహోమం సాగిస్తున్న రోజులలోనూ దీనికి అడ్డు నిలబడ్డారని చెప్పారు.

ఇటీవల మరణించిన ఐజేయూ నాయకులు అంబటి ఆంజనేయులు స్మృత్యర్థం సదస్సు రెండు నిమిషాలు మౌనం పాటించింది.

బ్యాంకుకు రూ.3.46 కట్టేందుకు 15 కిమీలు నడిచిన రైతు

బెంగళూరు: కోవిడ్ కాలంలో దేశ రైతులు అష్టకష్టాలు పడ్డారు. అనేక మంది అప్పుల ఊబిలో కరుకుపోయి ఆత్మహత్యలను శరణ్యంగా భావించారు. అటువంటి కష్టకాలంలో ఒక రైతు రూ.3.46 రుణాన్ని చెల్లించేందుకు 15 కిలోమీటర్లు నడిచి బ్యాంకుకు వెళ్లిన డబ్బు కట్టిన ఘటన కర్నాటకలో చోటుచేసుకుంది. ఇది ఆలశ్యంగా వెలుగు చూసింది. షిమొంగా జిల్లా, బారువే గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ రూ.35వేల వ్యవసాయ రుణాన్ని తీసుకోగా అందులో రూ.32వేలు మాఫీ అయింది. మిగిలిన రూ.3వేలను ఆయన చెల్లించేశారు. అయితే ఇంకా కొంత చెల్లించాల్సి ఉందని, వెంటనే దానిని కట్టేయాలని బ్యాంకు నుంచి ఫోన్ రావడంతో కంగారు పడిన లక్ష్మీనారాయణ హుటాహుటిన బయల్దేరి కాలి నడకన సమీప పట్టణం నిట్టూరులోని కెనరా బ్యాంకుకు వెళ్లారు. లాక్‌డౌన్ అమల్లో ఉండగా ప్రజా రవాణా స్తంభించిన క్రమంలో గత్యంతరం లేక 15కిలోమీటర్లు నడిచి బ్యాంకుకు చేరుకున్నారు. రూ.3.46 చెల్లించాలని సిబ్బంది చెప్పడంతో షాకైన ఆయన వెంటనే ఆ చిరు మొత్తాన్ని కట్టేశారు. బ్యాంకు అమానవీయంగా ప్రవర్తించడం బాధించిందని లక్ష్మీనారాయణ వాపోయారు.

విశాలాంధ్ర

3

ఆదివారం

02 జూలై 2023

రేపు అంబటి సంస్మరణ సభ

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): ఐజేయూ నాయకులు అంబటి ఆంజనేయులు సంస్మరణ సభ జులై 3వ తేదీ సోమవారం విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని ఏపీయూడబ్ల్యూజే విజయవాడ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, కొండా రాజేశ్వరరావు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ, విజయవాడ యూనిట్, ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని వెల్లడించారు. ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, సెక్రెటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్ము, పూర్వ అధ్యక్షుడు ఎస్ఎన్ సిన్హా, రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ సహా వివిధ రాజకీయ పార్టీల నేతలు, వివిధ రంగాల ప్రముఖులు, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టు సంఘాల జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. సభ ప్రారంభానికి ముందు ప్రెస్‌క్లబ్‌లో అంబటి ఆంజనేయులు చిత్రపటం ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు.

'నాటా' జర్నలిజం అవార్డు అందుకున్న కొమ్మినేని

విశాలాంధ్ర-విజయవాడ: సీనియర్ జర్నలిస్టు, సి.రాఘవాచారి ఆంధ్ర ప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు '2023 నాటా అవార్డ్ ఇన్ జర్నలిజం ఎక్సలెన్సీ' శనివారం అందుకున్నారు. అమెరికాలోని 'డల్లాస్'లో జరిగిన ఒక కార్యక్రమంలో జర్నలిజం రంగంలో ఆయన 46 ఏళ్ల విశేష ప్రతిభను గుర్తించి ఈ అవార్డును కొమ్మినేనికి ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) ప్రదానం చేసింది. నాటా అధ్వర్యంలో ఏటా జరిగే తెలుగు ప్రజల ఉత్సవాలను ఈ ఏడాది అమెరికాలోని డల్లాస్ నగరంలోని 'డల్లాస్ కన్వెన్షన్ సెంటర్'లో జూన్ 30 నుంచి జులై 2 వరకు నిర్వహిస్తున్నారు. 1956లో కృష్ణా జిల్లా గన్నవరంలో జన్మించిన కొమ్మినేని శ్రీనివాసరావు ఎం.కామ్. వరకు చదువుకున్నారు. 1978లో ఈనాడు దిన పత్రికతో జర్నలిజం రంగంలో ప్రవేశించారు. అలాగే వివిధ టీవీ ఛానళ్లలో కన్సల్టింగ్ ఎడిటర్‌గా పని చేశారు. సి.రాఘవాచారి ఆంధ్ర ప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ (కేబినెట్ మంత్రి ర్యాంక్) గా ఆయనను రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 10, 2022న నియమించింది.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై 5న చర్చలు

సీపీఎం బృందానికి మంత్రి అంబటి హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం బృందం శనివారం గుంటూరులో మంత్రి అంబటి రాంబాబుని కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. దానిపై స్పందించిన మంత్రి పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఎం ప్రతినిధి బృందంతో చర్చించేందుకు సంబంధిత అధికారులతో ఈనెల 5న సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రంపచోడవరం కార్యదర్శి బొప్పెన కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఉన్నారు.

బీజేపీని గద్దె దింపుదాం

ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-దాచేపల్లి: భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశంలో కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ పల్నాడు జిల్లా సమితి అధ్వర్యంలో జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్ అధ్యక్షతన నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కమ్యూనిటీ హాలులో రెండు రోజులు జరిగే సీపీఐ క్రియాశీల నాయకులు, కార్యకర్తలకు సైద్ధాంతిక శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ఆర్డినెన్స్‌ల ద్వారా రాష్ట్రాలకు గల అధికారాలని మోదీ సర్కారు హస్తగతం చేసుకుంటున్నదని ఆరోపించారు. ఆయా రాష్ట్రాలలో అధికారాన్ని దొడ్డిదారిన లాక్కున్న నీచ సంస్కృతి బీజేపీదేనన్నారు. హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా మెలిగే భారతదేశంలో మోదీ కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్ల రాజకీయాలకు తెరతీశారని తెలిపారు. ఎల్ఐసీ, ఇస్రో, రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీకి కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళారీ వ్యవస్థకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు ప్రజలకు అవసరం లేదని స్పష్టంచేశారు. మోదీ కుట్రలను తిప్పికొట్టేందుకు ఇటీవల పాట్నాలో 18 విపక్ష పార్టీల నేతలు సమావేశమయ్యాయని, మళ్లీ 13, 14 తేదీల్లో బెంగళూరులో సమావేశమవుతున్నారని ముప్పాళ్ల తెలిపారు. రానున్న దశాబ్దకాలంలో వామపక్ష పార్టీలు అధికారం సాధించేలా పార్టీ కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ జిల్లా సహాయ కార్య దర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి కోమెరా వెంకట్రావు, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వేముల వెంకటరెడ్డి, రైతుసంఘం సీనియర్ నాయకులు తెలనాకుల సత్యనారాయణ, బుర్రి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులపై నిర్లక్ష్యం

శ్రీనివాసరావు విమర్శ

విశాలాంధ్ర- ఏలూరు: రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం తక్షణమే పునరావాసం, పరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల 'పోరు కేక' మహా పాదయాత్ర ఏలూరు చేరుకున్న నేపథ్యంలో శనివారం సూర్య కన్వెన్షన్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదుకోట్ల ఆంధ్రులకు మేలు చేకూరుతుందని, ఇంతటి బహుళార్థ సార్థక ప్రాజెక్టు మన రాష్ట్రానికే తలమానికమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, కాంటూరు లెక్కలు తప్పుల తడకగా సాగుతున్నట్లు శ్రీనివాసరావు ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సరిదిద్దాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుందని చెప్పారు. ప్రాజెక్టుకు సంబంధించి కాంటూరు లెక్కలు తప్పుల తడకగా కనిపిస్తున్నాయన్నారు. ఇటీవల ప్రాజెక్టులోకి 31 నుంచి 37 మీటర్ల వరకు నీరు చేరగానే 190 గ్రామాలను వరద ముంచేసిందన్నారు. నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఇచ్చిన ఇళ్లు నాసిరకంగా ఉన్నాయన్నారు. పునరావాస కాలనీలలో తగిన సౌకర్యాలు లేవన్నారు. బిల్లులు ఇవ్వక నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయన్నారు. గైడ్ వాల్ కుంగటం ఎవరి లోపమని, డయాఫ్రమ్ వాల్ రంధ్రాలు పూడ్చడానికి రూ.2000 కోట్లు వెచ్చిస్తున్నారని, ఇది ఎవరు తిన్నట్టని ఆయన ప్రశ్నించారు. కాఫర్ డ్యామ్ లీకేజీలకు బాధ్యులెవరో వెల్లడించాలని డిమాండ్ చేశారు. పోలవరం తరహాలో నిర్వాసితుల సమస్యలపైనా ప్రభుత్వం సమీక్ష చేయాలన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతోందన్నారు. సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు నగర కార్యదర్శి పి.కిశోర్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబు ఇల్లు జప్తు దుర్మార్గం

ఇది జగన్ కుట్ర: వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాస భవనాన్ని జప్తు చేయడం దుర్మార్గమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మండిపడ్డారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన మంగళగిరిలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడూతూ ఈ విషయంలో సజ్జల రామకృష్ణారెడ్డి పైశాచికానందం పొందడం ఆశ్చర్యకరమన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయడమే ముఖ్యమంత్రి జగన్ ఉద్దేశమా? ప్రతిపక్షనేత చంద్రబాబుకు అడుగడుగునా అడ్డంకులు కలిగిస్తుంది అందుకేనా?ఆయన అద్దె ఇంటి జప్తుకు గురికాగా, ఆ తగవు ఇంటి యాజమాని లింగమనేని రమేశ్‌కి, ప్రభుత్వానికి మధ్య ఉంటే అందులోకి చంద్రబాబుని ఎందుకు లాగుతున్నారు? చంద్రబాబు కుప్పంలో నూతన గృహనిర్మాణానికి అనుమతివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఆయన ఇల్లు కట్టుకోవడం జగన్‌కు ఇష్టం లేదా? తాడేపల్లిలో జగన్ ఇల్లు కట్టుకోవాలంటే నాడు టీడీపీ ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇచ్చిన విషయం మరిచారా? అని రామయ్య ప్రశ్నించారు. చంద్రబాబు ఇంటిపై దాడికి, వీధి రౌడీలా వ్యవహరించిన జోగి రమేశ్‌కు పదోన్నతి కల్పించి మంత్రిని చేశారని, పార్టీ ప్రధాన కార్యాలయం మీద దాడి చేసిన చిరు నాయకుడిని పెద్దనాయకుడి హోదా కల్పించారన్నారు. బాధిత మాదిగ కుటుంబాలను పలకరించటానికి ఆత్మకూరు వెళ్తున్న చంద్రబాబును ఇంటిలో నుంచి బయటికి రాకుండా గేటుకు తాళ్లు కట్టి నిర్బంధించారు. అనపర్తిలో విద్యుత్ కోత విధించి ఎనిమిది కిలోమీటర్లు ఆయనను నడిపించారు. ఇప్పుడు ఆయన ఉండే ఇంటిని జప్తు చేయాలని చూస్తున్నారు. లింగమనేని రమేశ్ కట్టిన ఆ ఇంటికి ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అన్ని అనుమతులు ఇచ్చారన్న విషయం అసలు ఈ ముఖ్యమంత్రికి తెలుసా? ప్రతిపక్ష నాయకుడుగా జగన్ అధికార నివాసంగా లోటస్ పాండ్‌లోని ఇంటికి అనుమతి ఇచ్చింది నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అని తెలియదా? మరి ఈనాడు చంద్రబాబుకు ఇల్లు కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వ కుండా ఆయనను రోడ్డున పడేద్దామనుకుంటున్నారా? మీరెన్ని కుట్రలు పన్నినా, ఆయనకు ఇల్లు లేకుండా ఎన్ని ఆటంకాలు సృష్టించినా, ప్రస్తుతం ఉంటున్న ఇంటి నుంచి బయటికి పంపినా కోట్లాదిమంది ప్రజల గుండెల్లో చంద్రబాబు స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయాన్ని వైసీపీ నేతలు గమనించాలి' అని వర్ల రామయ్య వ్యాఖ్యానించారు.

వ్యవసాయ కార్మికసంఘం నేత

దగాని ఆకస్మిక మృతి

విశాలాంధ్ర-కూచిపూడి: కృష్ణాజిల్లా పామర్రు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు దగాని సంగీతరావు (67) శనివారం వేకువ జామున మృతి చెందారు. ఆయన భార్య గతంలోనే చనిపోయారు. కుమారుడు, కుమార్తె మనుమలు, మనుమరాలు ఉన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలఆధ్వర్యంలో విద్యుత్ సమస్యపై మొవ్వ మండలం కాజ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. కాజ గ్రామంలో ప్రాథమిక చికిత్స అనంతరం మచిలీపట్నం ప్రైవేటు వైద్యుని దగ్గరికి తీసుకెళ్లగా వారి సూచనల మేరకు విజయవాడలో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువఝామున మృతి చెందారు. సంగీతరావు ఆకస్మిక మృతి పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతి వార్త తెలిసి ఆయన స్వగ్రామం మొవ్వ మండలం కాజ శివారు మట్ల మాలపల్లి శోకసముద్రంలో మునిగింది. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులై కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన అంచలంచెలుగా ఎదిగి జిల్లా కార్యవర్గ సభ్యులుగా, పామర్రు నియోజకవర్గ కార్యదర్శిగా, ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడిగా పార్టీకి విస్తృత సేవలు అందిస్తున్నారు.

నిబద్ధత గల నేతను కోల్పోయాం: నాయకుల నివాళి

సంగీతరావు మృతితో భారత కమ్యూనిస్టు పార్టీ అకుంఠిత దీక్షతో నిరంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని జిల్లా, రాష్ట్రస్థాయి పార్టీ నేతలు పేర్కొన్నారు. సంగీతరావు మృతదేహాన్ని ఉదయం 11 గంటలకు కూచిపూడి-పెదపూడిలోని చలసాని కాంచన రావు భవన్ వద్ద అభిమానుల సందర్శనార్థం ఉంచారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, కేవీవీ ప్రసాద్, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కార్యదర్శులు నార్ల వెంకటేశ్వరరావు, సీహెచ్ కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శులు టి. తాతయ్య, అద్దాడ ప్రసాద్ తదితరులు భౌతికకాయంపై పూలమాలవేసి నివాళి అర్పించారు. పార్టీ నేతలతో పాటు మొవ్వ మండల అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, కార్మికులు, అభిమానులు సందర్శించి పూలదండలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కోసూరు, కాజ గ్రామాల గుండా ప్రదర్శనగా మట్లమాలపల్లెలోని స్వగృహానికి భౌతికకాయాన్ని తరలించారు. అక్కడ బంధువులు కుటుంబ సభ్యులు దళితవాడవాసులు అభిమాన నేతకు కడసారి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు దేవభక్తుని రంగారావు మృతి

విశాలాంధ్ర-మచిలీపట్నం: సీనియర్ కమ్యూనిస్టు దేవభక్తుని రంగారావు శనివారం ఇక్కడి భాస్కరపురంలోని ఆయన స్వగ్రామంలో మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న రంగారావు కృష్ణాజిల్లా కమ్యూనిస్టు పార్టీ పూర్వ కార్యదర్శి అమరజీవి మాలెంపాటి బాల భాస్కర రావు పెద్ద అల్లుడు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరూ కుమార్తెలు ఉన్నారు. భార్య దేవభక్తుని నిర్మల సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలుగా కృష్ణాజిల్లాలో, రాష్ట్రంలో మహిళా సమాఖ్య నిర్మాణంలో నిరంతరం కృషి చేస్తున్నారు. విజయవాడ లయోలా కాలేజీలో విద్యాభ్యాసం చేస్తూనే మార్క్సిస్టు భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఉన్నత ఉద్యోగాన్ని కూడా వదులుకొని ఇండో సోవియట్ కల్చరల్ సొసైటీ (ఇస్కస్) లోనూ ఇండో జర్మన్ కల్చరల్ సొసైటీ లోను ప్రధాన బాధ్యతలు స్వీకరించి, ఆ సంఘాల అభివృద్ధికి కృషి చేశారు. దివితాలూకాలోను, మచిలీపట్నం లోను పార్టీ ప్రజాసంఘాల నిర్మాణానికి కృషి చేస్తూ ఆర్థికంగా తోడ్పాటును అందించారు. చనిపోయే వరకు పార్టీ సభ్యునిగా కొనసాగారు. ఈ ప్రాంతానికి రాష్ట్ర ప్రజా సంఘ నాయకులు ఎవరు వచ్చినా భోజన ఏర్పాటు చేసేవారు. రంగారావు మృతికి సీపీఐ బందరు నియోజకవర్గ సమితి ప్రగాఢ సంతాపం ప్రకటించింది. రంగారావు మృతి వార్త తెలియగానే రాష్ట్ర,పట్టణ, జిల్లా పార్టీ నాయకులు రంగారావు ఇంటికి చేరుకుని భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి పూలదండలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు తాటిపర్తి తాతయ్య, అద్దాడ ప్రసాద్, చేనేత సంఘం రాష్ట్ర అధ్య క్షులు కట్టా హేమ సుందరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మెరుగు విజయకుమార్, సీపీఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు మోదుమూడి రామారావు, నాయకులు పెయ్యల వెంకటేశ్వరరావు, మున్నంగి నరసింహారావు, పేరిశెట్టి ఉమాకాంతం, తుమ్మా చిన్న కొండయ్య, జ్యోతిశ్వరరావు, యర్రం శెట్టి ఈశ్వర రావు, కరపాటి సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు బండి అరుణ ప్రసాద్, అగ్రిగోల్డ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే గగన్, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మల్లిపెద్ది రత్న కుమారి, నాయకులు కె ప్రభు కుమారి, హనుమానుల రాణి కుమారి, ఒడుగు రత్నకుమారి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీరం శెట్టి లలిత, మలిపెద్ది బోసు, మల్లుపెద్ది అజయ్ తదితరులు రంగారావు భౌతికకాయంపై పూలమాలలు ఉంచి విప్లవ జోహార్లు అర్పించారు.

4 నుంచి అగ్రి, ఫార్మసీ ర్యాంకు కార్డులు జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీ సెట్ (2023) అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన ఇంటర్ బైపీసీ అభ్యర్థులు తమ ర్యాంకు కార్డులను ఈనెల 4వ తేదీ ఉదయం 9 గంటల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇంటర్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన వారు 6వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్ నుంచి ర్యాంకు కార్డులు పొందవచ్చు.

మందలలో చారిత్రక శిల్పాలకు ఆదరణ కరువు

శిథిలమౌతున్న 400 ఏళ్లనాటి కొయ్యరథం

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం, మందల గ్రామంలోని సకలేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో చారిత్రక శిల్పాలు, శాసనాలు, కొయ్య రథాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డా॥ఈమని శివనాగిరెడ్డి సూచించారు. శ్రీనాథ సాహితీ పరిషత్, కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, మణిమేల శివశంకర్ ఇచ్చిన సమాచారం మేరకు ఆయన శనివారం మందల గ్రామంలోని చారిత్రక అనవాళ్లను పరిశీలించి, ఆసక్తికర విషయాలను వెల్లడించారు. గ్రామంలోని సకలేశ్వరాలయ ప్రాంగణంలో వున్న క్రీ.శ.1125-1523 సంవత్సరాల మధ్య కాలానికి చెందిన 25 శాసనాలు స్థానిక పాలకులైన కొండ పడుమటి, వెలనాటి, కాకతీయ, విజయనగర రాజులు విడుదల చేసినవారున్నారు. ఆ శాసనాల్లో, సకలేశ్వర, కోటేశ్వర, త్రిపురాంతక, సాగరేశ్వర దేవాలయాలు, ఏడు చెరువుల నిర్మాణ, ఆలయ నిర్వహణ, జీర్ణోద్ధరణ, దీపారాధనకు కావలసిన నెయ్యి కోసం, భూమిని, గొర్రెల్ని దానం చేసిన వివరాలున్నాయని చెప్పారు. అన్ని శాసనాల్లో గ్రామం పేరు మా మండల అని ఉందని, ఒక్క క్రీ.శ.1390 నాటి శాసనంలో మాత్రమే మాందల అని ఉందని, అదే క్రమంగా మందలగా స్థిరపడిందని శివనాగిరెడ్డి తెలిపారు.

సకలేశ్వరస్వామి దేవాలయంలో అపురూపశిల్పాలైన నాగదేవతలు, మహిషాసురమర్ధిని, భైరవ, గణపతి, కుమారస్వామి, వీరుల శిల్పాలు, దంపతుల శిల్పాలు, చారిత్రక ప్రాధాన్యత గల శాసనాలు నిర్లక్ష్యానికి గురై, నేలపై పడి ఉన్నాయని, వాటిని పీఠాలపై నిలబెట్టాలన్నారు. పల్నాడుజిల్లాకే వన్నె తెచ్చేలా, అద్భుత శిల్పాలతో అలంకరించిన 400 సంవత్సరాల నాటి కొయ్యరథం శిథిలమైపోతోందని, నంది, గణపతి శిల్పాలకు వేసిన రంగు వల్ల ప్రాచీనతకు భంగం కలిగిందని శివనాగిరెడ్డి వాపోయారు. ఇప్పటికైనా వాటిని భద్రపరచి భవిష్యత్తరాలకు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మందల గ్రామ ప్రజలకు, ఆలయ అధికారులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఈ ఏడాది లక్షా 50 వేల ఎంఎస్ఎంఈ యూనిట్లు

- 7 లక్షల 50 వేల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్.జవహర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ ఏడాది లక్షా 50 వేల ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పి 7 లక్షల 50 వేల మందికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి తెలిపారు. ఆ మేరకు అన్ని జిల్లాల్లో ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన భూముల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకునేలా తరచు కలెక్టర్లతో మాట్లాడాలని పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌ను సీఎస్ ఆదేశించారు. శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన ఎంఎస్ఎంఈ రంగంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గత ఏడాది రూ.15 వేల 625 కోట్ల ఖర్చుతో లక్షా 25 వేల యూనిట్లు నెలకొల్పి లక్షా 56 వేల మందికి పైగా ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 62 శాతం లక్ష్య సాధనతో 92 వేల 707 యూనిట్లను నెలకొల్పి, 3 లక్షల 61 వేల మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద ఏర్పాటు చేస్తున్న వివిధ యూనిట్లను అక్టోబరు 2న ప్రారంభించేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి అనే విధానం కింద ప్రతి జిల్లా నుంచి కనీసం రెండు మూడు ఉత్పత్తులను గుర్తించి ఆ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని పరిశ్రమల శాఖ, చేనేత జౌళి శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ కె.ప్రవీణ్ కుమార్ రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగంలో జరుగుతున్న కార్యక్రమాల ప్రగతిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ కార్యక్రమం కింద 2022-23లో 6,750 యూనిట్లు నెలకొల్పాల్సి ఉండగా, 3,069 యూనిట్లు నెలకొల్పి 25 వేల మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తిలో భాగంగా ప్రాథమికంగా విశాఖ, కాకినాడ, గుంటూరు జిల్లాల నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు ప్రవీణ్ కుమార్ వివరించారు. రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ చేనేత జౌళి శాఖకు సంబంధించి ఒక జిల్లా ఒక ఉత్పత్తికి కింద రాష్ట్రంలో 35 రకాల ఉత్పత్తులను గుర్తించామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ జేడీ రామలింగేశ్వర రాజుతో పాటు పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వీధి రౌడీలా పవన్ తీరు

ఎంపీ నందిగం సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ భీమవరం బహిరంగ సభలో మాట్లాడిన తీరు చూస్తే, ఆయనొక వీధిరౌడీలా, అసాంఘికశక్తిలా ఉన్నదని వైసీపీ ఎంపీ నందిగం సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రసంగం చూస్తే ఎక్కడా ఆయనొక రాజకీయ నాయకుడనే భావన కలగలేదని, చోటామోటా రౌడీయిజం చేసే వ్యక్తిలా మాట్లాడారని ప్రజలంతా భావిస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేయాలనేలా ఆయన ప్రసంగం తీరు ఎక్కడా కనిపించలేదని, సినిమాల్లో తాను ఎలా నటించినా ప్రేక్షకులు టిక్కెట్లు కొని చచ్చినట్లు చూస్తారనే భావనతోనే, భీమవరం బహిరంగ సభను పవన్‌కల్యాణ్ నడిపారని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ తన బానిసత్వాన్ని సమర్ధంగా నిరూపించుకుంటున్నారని విమర్శించారు. గ్లాస్ పవన్‌దైనా, ఛాయ్‌మాత్రం చంద్రబాబుదేనని అన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ ఇప్పటికే వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని డీబీటీ ద్వారా రూ.2.23లక్షల కోట్ల లబ్ధిని ప్రజలకు అందించారని వివరించారు. దీనిపై ఇటు పవన్‌కల్యాణ్, అటు చంద్రబాబు మాత్రం రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని గుండెలు బాదుకుంటు న్నారన్నారు. మరోవైపు ఇప్పటికన్నా మించి మేం చేస్తామని చెప్పుకుంటున్నారంటే ఈ బాబు, పవన్‌లకు సిగ్గుందా..? లేదా..? అని నిలదీశారు. సీఎం జగన్ పేదలకు అన్నిరకాలుగా అండగా ఉన్నారని స్పష్టం చేశారు.

సంపాదకీయం

మణిపూర్‌కంటే ఎన్నికలే మోదీకి ముఖ్యం

మణిపూర్‌లో మంటలను ఎలా చల్లార్చాలో తెలియని ప్రధాని మోదీ,అమిత్‌షాలు ఆ రాష్ట్రంలో పర్యటించడానికి కూడా సిద్ధంగా లేరు. మణిపూర్‌ను పట్టించుకోకుండా ఈ ఏడాది చివరిలో జరగనున్న అసెంబ్లీల ఎన్నికలకు 2024లో జరగనున్న లోకసభ ఎన్నికలకు సిద్ధమవుతున్న మోదీ వైఖరిలో ఏ మాత్రం మార్పులేదని అర్థమవుతుంది. ప్రతిపక్షాల ఐక్యత రోజురోజుకీ బలోపేతమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో మోదీ–షాలకే బీజేపీ నాయకత్వం భీతిల్లుతుందని చెప్పాలి. అందువల్లనే మణిపూర్‌కంటే ఎన్నికల్లో గెలవడమే ముఖ్యం. మణిపూర్ ప్రజలు ఏమనుకున్నా పట్టించుకోనవసరంలేదని భావిస్తూ ఉండవచ్చు. రెండు నెలలుగా రాష్ట్రంలో మంటలు చెలరేగుతున్నా కనీసం ఒక్కసారైనా పర్యటించలేదని మణిపూర్ ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీపై ఆగ్రహంగా ఉన్నారు. వివిధ జాతుల ప్రజలమధ్య చోటుచేసుకున్న హింసాకాండలో 160 మందికిపైగా ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ స్థితిలో ఉన్న ప్రజలను కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ రాష్ట్రంలో రెండు రోజులు పర్యటించి బాధితుల నివాస శిబిరాలకు వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన శాంతి, సామరస్యత సందేశం రాష్ట్ర మంతటా విస్తరించింది. ఇంతవరకు పాలకులు కనీసం తమను పలుకరించలేదని ఆగ్రహం చెందుతున్న ప్రజలు రాహుల్ పర్యటనను ఆహ్వానించారు. సామాన్య ప్రజలేగాక, మేథావులు మోదీని, బీజేపీని వ్యతిరేకిస్తున్నారు. ఇకపై మణిపూర్ ప్రజలు బీజేపీని దూరంగా ఉంచనున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. కాలిపోతున్న రాష్ట్రాన్ని నిర్లక్ష్యంచేసి విదేశీ పర్యటనలో మోదీ విహరించడం ఏమిటని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో వేలాది గృహాలను దహనం చేశారు. ఆస్తులు లూటీ చేశారు. లక్షన్నర మందికి పైగా నిరాశ్రయులై నిర్వాసిత శిబిరాలల్లో ఇతర సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. మోదీ రాష్ట్రంలో పర్యటించి బాధితులను ఓదార్చి సమస్యను పరిష్కరించి సహాయం అందిస్తారని ప్రజలు ఆశించారు. ప్రధాని వైఖరిపై విరుచుకు పడుతున్నారు. ప్రజల మనోభావాలను తెలుసుకునేందుకు మోదీ యత్నించలేదని ప్రజలు అసమ్మతిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పరిస్థితులు అధ్వాన్నస్థితికి చేరాయి. సమస్య మూలాలను తెలుసుకొని ప్రజల బాధలను పట్టించుకోలేదని విద్యావంతులు, మేథావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిదేళ్లకుపైగా బీజేపీ నాయకుడు మోదీ పాలనలో తమకు ఎలాంటి పరిష్కారం లభించలేదని, రాష్ట్ర ప్రజలను పూర్తిగా విస్మరించారని ఇకపై బీజేపీని దూరంగా ఉంచుతామని చెపుతున్నారు. మణిపూర్‌లో ఏం జరుగుతుందని తెలిసినా మోదీ మౌనంగా ఉండటం ఇది మొదటిసారి కాదని, దేశంలోనూ ఏ సమస్యను పరిష్కరించదని అనేకమంది విద్యావంతులు వ్యాఖ్యానిస్తున్నారు.

మోదీ ఏ నిర్ణయం తీసుకోకుండా ఉంటున్నారని, తమ నాయకత్వం తీసుకుంటున్న వైఖరి ఏమిటని కూడా మోదీ గమనించడంలేదని ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది విభ్రాంతి గొలిపే విషయం. జాతీయ ప్రాముఖ్యతగల విషయాలను పట్టించుకోకుండా ఉష్ట్ర పక్షిలాగా ఉంటున్నారని కొందరు ఆర్‌ఎస్‌ఎస్ దిగువస్థాయి నాయకులు మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులను వ్యతిరేకం చేసుకోకుండా ఉంటున్నారని కూడా సంఘ్ వర్గాలు వ్యాఖ్యానించడం విశేషం. మోదీ బలహీనమైన పాలకుడని కూడా వారు అంటున్నారు. తాజాగా ఏర్పడిన కల్లో పరిస్థితులు ఏర్పడిన నాటి నుంచి మోయితీలు దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. పైగా మోదీ రాష్ట్రంలో పర్యటించడానికి మెయితీలు ఇష్టపడటంలేదన్న సమాచారం ఆశ్చర్యం కలిగిస్తోంది. దాదాపు 300పైగా చర్చిలను ధ్వంసం చేయడంలో రాష్ట్రంలోనూ, దేశంలోని అనేక రాష్ట్రాల క్రైస్తవులు, ఫాదర్‌లు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోదీ అసమర్థత స్పష్టంగా కనిపిస్తోందని కేరళ చర్చిల ఫాదర్‌లు వ్యాఖ్యానించారు. కుకీలు క్రైస్తవ విశ్వాసకులు. మెయితీలపై ఇప్పుడు తాము పట్టుకోల్పోయామని ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు చెపుతున్నాయి. అందువల్ల తమకు మణిపూర్‌లో అధికారం లేకపోయినా ఇబ్బంది లేదనివారు అంటున్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్ సాయంత్రం వరకు రాజీనామా చేస్తానని చెప్పి ఒక్కసారిగా మార్చి రాజీనామా చేయడంలేదని ప్రకటించారు. ఈ నాటకాన్ని బీజేపీ కేంద్ర నాయకత్వమే నడిపించిందని అంచనా వేశారు.

రాహుల్ రాష్ట్రంలో పర్యటించి బాధితులను పరామర్శించి, తాము అండగా నిలుస్తామని ఓదార్చడం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు ఇబ్బందిగా పరిణమించింది. రాహుల్ ఎలాంటి రాజకీయాల జోలికి వెళ్లలేదు. ప్రజలంతా శాంతిని కాపాడాలని మాత్రమే ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు కలిసి సంక్షోభాన్ని కాస్త ఉపశమనం చేసేందుకుగాను ముఖ్యమంత్రి రాజీనామా నాటకం ఆడించాయని కూడా రాష్ట్రంలో అనేక వర్గాలు వ్యాఖ్యానించాయి. శుక్రవారం ముఖ్యమంత్రి ఉదయం పది గంటల ప్రాంతంలో రాజీనామా పత్రం ఇవ్వడానికి గవర్నరు వద్దకు వెళ్లాలని ప్రయత్నించగా, ఆయనింటికి కొంచెం దూరంలో చాలమంది మహిళలు రహదారిని దిగ్బంధం చేశారు. ఇదంతా నాటకంలో భాగమే. మధ్యాహ్నం 2.30గంటలకు కూడా కొందరు ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలవడానికి ఇంటినుంచి బైటకురాగా మళ్లీ ప్రజలు వచ్చి అడ్డుకున్నారు. ఇలా సాయంత్రం వరకు నాటకం నడిచింది. మహిళల్లో ఒకరు ఇలా వ్యాఖ్యానించారు. తల్లులంతా ఈ ముఖ్యమంత్రి రాష్ట్రానికి వద్దని చెప్పడానికే వాస్తవంగా ఇక్కడికి చేరుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో రెండు నెలలుగా జరుగుతున్న విధ్వంసం, దహనకాండకు మహిళలంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులు సరిగా ఆహారం, దుస్తులను సహాయం చేయడంలేదని రాహుల్‌గాంధీకి చెప్పారు.తాము ఏదో విధంగా జీవిస్తున్నామని బాధను వ్యక్తం చేశారు. ఈ విషయాలను రాహుల్‌గాంధీ రాష్ట్ర గవర్నరును కలుసుకుని వివరించి, చర్యలు తీసుకోవాలని కోరారు. హింస పరిష్కారం కాదని, శాంతిని పాటించాలని ప్రజలకు రాహుల్ విజ్ఞప్తి చేశారు. శిబిరాలు సందర్శించాక, భయంకరమైన విషాదం చోటుచేసుకున్నదని రాహుల్ వ్యాఖ్యానించారు. గవర్నరును కలిసిన తర్వాత రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ, హింసవల్ల ఎవరికీ ప్రయోజనం కలగదు, శాంతి మాత్రమే భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని అని ఆయన అన్నారు. తాను కలుసుకున్న సోదరీ, సోదరీమణులు, పిల్లల సహాయంకోసం ఎదురు చూస్తున్నామని చెప్పారని అన్నారు. శిబిరాల్లో మౌలికసదుపాయాలను మెరుచుపచాలని ఆయన కోరారు. ఆహారం, మందులు సరఫరా చేయాలన్నారు. శాంతి అన్నిటికంటే ముఖ్యమైనదని రాష్ట్ర ప్రజలంతా కలిసి సాధించాలని కోరారు. తక్షణం మోదీ మణిపూర్‌లో పర్యటించి సమస్యను పరిష్కరించకపోతే ఆ రాష్ట్రం రావణకాష్టంలా తయారుకావచ్చు.

కమ్యూనిస్టులపై ట్రంప్ చిందులు

ని.జె అట్కిన్స్

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిమినల్ కేసుల్లో ఇరుక్కొని అప్రతిష్ఠ పాలయ్యాడు. కోర్టు తీవ్రంగా నేరారోపణ చేసింది. గూఢచారిచట్టాన్ని ట్రంప్ ఉల్లంఘించారు. ఇందుకుగాను ట్రంప్‌కు 11 మిలియన్ డాలర్లు జరిమానా విధించింది. వైట్‌హౌస్‌లో ఉండవలసిన అత్యంత రహస్యపత్రాలను 11 పెట్టెల్లో తీసుకువెళ్లి తనింటిలో దాచుకున్నాడు. ఇంటిలిజెన్స్ అధికారులు ఇంటికి వెళ్లి సోదాచేసి రహస్యపత్రాలు స్వాధీనం చేసుకుని కోర్టుకు అప్పగించారు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రత్యర్థులపైన విమర్శలు గుప్పిస్తున్నారు. దర్యాప్తు అధికారులనూ దునుమాడారు. తాను తిరిగి గెలిస్తే దేశం నుండి కమ్యూనిస్టులను దేశ బహిష్కరణ చేస్తానని చిందులు తొక్కుతున్నాడు. ఆయనపైన విమర్శలు చేసేవారిని సహించలేకున్నాడు. అలాగే వామపక్షాలను తీవ్రంగా దూషిస్తున్నాడు. ఇటీవల వారం పదిరోజుల నుండి ఫాసిస్టుల వలె ప్రవేశిస్తూ చిందులు వేస్తున్నాడు. ఎన్నికల ప్రచార సభల్లో కమ్యూనిస్టులు, సోషలిస్టులు, మార్క్సిస్టులు ఏకమై బలమైన శక్తిగా ఎదిగి అమెరికా పతనానికి పూనుకున్నారని వీరంగం చేస్తున్నాడు. గత వారం చివరిలో వాషింగ్టన్‌లో అత్యంత మితవాద ఇవాంజెలికల్ "విశ్వాసం-స్వేచ్ఛ సదస్సు" అనే అంశంపై 90 నిమిషాలసేపు ట్రంప్ ప్రసంగించారు. ఆయన ప్రసంగం మెకర్థీ కాలంనాటి దాడులవలె ఈ ప్రసంగం సాగింది. క్రైస్తవ ఛాందసవాదుల సమూహాన్ని ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ డెమొక్రటిక్‌పార్టీ "ప్రతి మనిషి, ప్రతి మహిళ, ప్రతి బిడ్డపై తమ కమ్యూనిజం సిద్ధాంతాన్ని రుద్దాలని చూస్తోంది." అని ఆరోపించారు.

అధ్యక్షుడు జో బైడెన్ పాలనాకాలంలో క్రైస్తవులను హింసించేందుకు ప్రయత్నించారని ట్రంప్ ధ్వజమెత్తాడు. క్రైస్తవ మతాన్ని తక్కువచేస్తూ తన నేరాలపై దర్యాప్తులు జరిపిస్తున్నారని అన్నారు. వారు తన స్వేచ్ఛను అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఇందుకు తాను అనుమతించబోనని ట్రంప్ తీవ్రంగా మాట్లాడారు. క్రైస్తవులకోసం తాను పోరాడినట్లుగా ఏ అధ్యక్షుడూ పోరాడలేదని ట్రంప్ చెప్పుకున్నారు. అబార్షన్ అనేది మహిళలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని దాన్ని లేకుండా చేస్తున్నారని ట్రంప్ మాట్లాడారు. తాను క్రైస్తవుల కోసం ఆధునిక అమరుడను కావడానికైనా సిద్ధంగాఉన్నానన్నారు. ప్రతిసారి రాడికల్ వామపక్ష డెమొక్రాట్లు, మార్క్సిస్టులు, కమ్యూనిస్టులు తనను దూషించడానికి ప్రయత్నిస్తున్నారని అది తనకు మరింత ధైర్యాన్నిస్తుందని ట్రంప్ అన్నారు. మార్క్సిజం ఫాసిజంతో సమానమని కూడా ట్రంప్ ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడారు. కమ్యూనిస్టు వ్యతిరేక భావజాలాన్ని నరనరాన ట్రంప్ జీర్ణించుకున్నాడు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సరిహద్దుల్లో మెక్సికన్ పౌరులను రాకుండా కట్టుదిట్టం చేశానని, మెక్సికో వలసదారులు రేపిస్టులు, హంతకులు అని ట్రంప్ నోరుపారేసుకున్నారు. మళ్లీ తాను గెలిస్తే, వలస వచ్చినవారి పిల్లలను, తల్లితండ్రులకు దూరంగాఉంచే విధానాన్ని అవలంబిస్తానని, ఈసారి ఆ దేశం నుంచి వలస వచ్చేవారిని దేశంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోనని చెప్పారు. సరిహద్దుల్లో గోడ నిర్మాణాన్ని పూర్తి చేస్తానని అన్నారు. తాను అనుసరించిన విధానాలు చాలవని కమ్యూనిస్టుల నుంచి ముప్పు అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆరోపించారు.

ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 212(ఎఫ్) కింద కమ్యూనిస్టులు, మార్క్సిస్టులను తమ దేశంలోకి రాకుండా ఉత్తర్వు జారీ చేస్తానని పేర్కొన్నారు. మా దేశంలోకి వచ్చినవారు మా దేశాన్ని విధిగా ప్రేమించాలి. మా దేశాన్ని విధ్వంసం చేయడానికి వారిని అనుమతించడంలేదు. విదేశీ క్రైస్తవులు కమ్యూనిస్టులు, సోషలిస్టులు, మార్క్సిస్టులను ద్వేషిస్తున్నారని అన్నారు. అందువల్లనే మేము వారిని అమెరికాకు దూరంగా ఉంచుతున్నామని తెలిపారు. కమ్యూనిస్టులు దేశంలోకి రాకుండా ఇప్పటికే నిషేధం విధించే చట్టం అమలులో ఉందని అన్నారు. కమ్యూనిస్టుపార్టీల అనుబంధ సంఘాల సభ్యత్వం ఉన్నవారిని కూడా అనుమతించబోమని మాట్లాడారు. ఇప్పటికే ఎదిగిన కమ్యూనిస్టులను ఏం చేస్తారని నా ప్రశ్న? అని మాట్లాడారు. ప్రసంగం వింటున్నవారు వారిని బహిష్కరించండి అంటూ నినాదాలు చేశారు. 1919, 1920లలో పేరుమోసిన పాల్మర్ దాడులను ట్రంప్ మళ్లీ పునరుజ్జీవింపచేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆనాడు విదేశాల్లో జన్మించిన కమ్యూనిస్టులను, రాడికల్ వామపక్షవాదులను అరెస్టుచేసి దేశం నుంచి బైటకు పంపాలని న్యాయశాఖ నిర్ణయం తీసుకుని దాన్ని అమలు చేసింది అన్నారు. మళ్లీ ఆనాటి పరిస్థితులను తీసుకు రావాలని పిచ్చెక్కినట్లుగా ట్రంప్ మాట్లాడారు. తాను అధికారంలోకివస్తే పుట్టిన ప్రతివారికి పౌరసత్వం ఇవ్వకుండా నిషేధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వు జారీ చేస్తానని అన్నారు. ఆయన ప్రసంగమంతా ఎక్కువగా కమ్యూనిస్టులను నిందించడానికే కేటాయించారు. అంతర్జాతీయంగా కూడా కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

24 గంటల్లోపు క్యూబాలో చైనా తన సైనిక స్థావరాలను ఖాళీ చేయాలని అక్కడ ఉన్నవాటిని కూడా ధృవీకరించడంలేదని ట్రంప్ అన్నారు. ఫ్లోరిడాకు 90 మైళ్ల దూరంలోఉన్న వినడంకోసం ఏర్పాటుచేసిన చైనా కోస్టులను బైడెన్ ప్రభుత్వం అనుమతించిందని ఆరోపించాడు. ట్రంప్ తొలినుంచీ కమ్యూనిస్టులను ద్వేషిస్తూనే ఉన్నాడు. అత్యంత మితవాద, ఛాందసవాద రాజకీయాలను ఆయన అంటిపెట్టుకొని ఉన్నాడు. 1930లలో ట్రంప్ హిట్లర్ నాజీ పార్టీ అమెరికా సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన అవుట్ కోస్టులను ఆయన సమర్థించాడు. కమ్యూనిస్టు వ్యతిరేకతను నిలువెల్లా నింపుకున్నాడు.

క్వాలిటీ కంట్రోలు విభాగంలేని పోలవరం

వి. శంకరయ్య

పోలవరం ప్రాజెక్టుకు ఏ సుముహూర్తాన లేక దుర్ముహూర్తాన పునాదిరాయి పడిందో ఏమో గాని భారత దేశంలోనే ఏ సాగునీటి ప్రాజెక్టుకు లేనన్ని సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఒకటి కాదు. అనేకం. లెక్కలేనన్ని. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినా కేంద్రం నుండి సకాలంలో చాలినన్ని నిధులు రావడం లేదు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వమూ లేదు. రాష్ట్ర ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించనందున ప్రాజెక్టు నిర్ణీత కాలంలో నిర్మాణం పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. ఫలితంగా ఏ ఏటికాయేడు నిర్మాణ వ్యయం ఆంజనేయుని వాలంలాగా పెరిగిపోతోంది.

ఈ స్థితిలో ప్రాజెక్టు నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని సందిగ్ధత నెలకొంది. తుదకు 194.60 టియంసిల నీరు నిల్వచేయగల బహుళార్థ సాధక ప్రాజెక్టును ఒక బ్యారేజీగా చేసి 92 టియంసిలు నిల్వకు పరిమితం చేస్తారనే వార్తలు హడలు పుట్టిస్తున్నాయి. తాజాగా ఇప్పటివరకు నిర్మితమైన ప్రాజెక్టు వివిధ విభాగాల భద్రత ప్రమాణాలపైన నీలి నీడలు కమ్ముకొంటున్నాయి. ఎగువ కాఫర్ డ్యాంలో సాధారణ స్థితికన్నా ఎక్కువగా లీకేజీ వుందని గత సంవత్సరం లాగా ఈ ఏడు భారీ వరద వస్తే కాఫర్ డ్యాం ఎంత వరకు తట్టుకొని నిలబడుతుందనే భయాలు వెన్నాడుతున్నాయి. దీనికి తోడు స్పిల్‌వే పక్కన దాని పటిష్టత కోసం నిర్మించిన గైడ్ బండ్ ఇటీవల కూలిపోయింది. అయిదు మీటర్ల లోతు నుండి 25 మీటర్ల ఎత్తు వరకు నిర్మించిన రీటైనింగ్ వాల్ ఆధారం చేసుకొని గైడ్ బండ్ నిర్మించారు. నిర్మించి రెండు నెలలు పూర్తి కాక ముందే గైడ్ బండ్ కూలిపోయింది. అంటే గైడ్‌బండ్‌కు సపోర్ట్‌గా నిర్మించిన రీటైనింగ్ వాల్ కుంగిపోవడంతో గైడ్‌బండ్ కూలి పోయింది. కాగా 2020 సంవత్సరం వరదలకు దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ 2022 లోగాని గుర్తించలేకపోయారు. వేలకోట్ల వ్యయంతో కొన్ని లక్షల ప్రజల జీవితాలతో ముడిపడి నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టులో ఒకటికి రెండు విభాగాల్లో నిర్మాణ దశలోనే లొసుగులు ఏర్పడితే ఇక మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఏ పరిణామాలకు దారి తీస్తుందోననే ఆందోళన కలగడం అసహజమేమీ కాదు. ఇటీవల ఢిల్లీ నుండి వచ్చి ఈ నిర్మాణ లోపాలను పరిశీలించి వెళ్లిన నిపుణుల బృందం ఇంకా నివేదిక ఇవ్వలేదంటున్నారు. కాగా అప్రోచ్ ఛానల్ నిర్మాణంపై కూడా విమర్శలున్నాయి.

ఇవన్నీ అటుంచగా కొన్ని వందల కోట్లు వ్యయంచేస్తూ శతాబ్దాలపాటు పదిలంగా వుండ వలసిన భారీ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుంటే నాణ్యతా ప్రమాణాలు, పర్యవేక్షణకు పటిష్టమైన క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎందుకు లేదు? క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు వుంటే ఈ లొసుగులకు ముందుగా వారు బోను ఎక్కవలసి వుంది. విస్తుగొల్పే అంశమేమంటే గైడ్‌బండ్ కూలిపోయిన తర్వాత నిపుణుల బృందం వచ్చిన సమయంలోగాని, అంత క్రితం, తర్వాతగాని పరిశీలనలేక చర్చల సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ అధికారుల ప్రస్తావన ఏ మాత్రం రాలేదు. వాస్తవంలో నిపుణుల బృందం వచ్చినపుడు ముందుగా క్వాలిటీ కంట్రోల్ అధికారులను విచారణ జరపవలసి వుంది. ఏ సందర్భంలో కూడా వారి ప్రస్తావన లేదంటే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం లేనట్లే భావించ వలసి వస్తోంది. తెలుగుదేశం హయాంలో చేపట్టిన రహదారులు, కాలువల, కుంటల మరమ్మతులకు ఇప్పుడు బిల్లులు ఇచ్చే సమయంలో విజిలెన్స్ అధికారులు కత్తితో కోతకోసి బిల్లులను చెల్లించుతున్న రాష్ట్రప్రభుత్వం వేలాది కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులను నియమించలేదంటే ఏలా నమ్మ గలం?

ఈ లొసుగుల వ్యవహారంలో కేంద్ర జలశక్తిశాఖతో పాటు అది ఏర్పాటుచేసిన రెండు సంస్థలు కూడా బాధ్యత వహించవలసివుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం రెండు సంస్థలను నియమించింది. డిజైన్‌లు ఆమోదించడం సాంకేతిక అంశాలపై డ్యాం డిజైన్ రివ్యూ పానల్ కమిటీ ఒక దాన్ని నియమించింది. వీరి ఆమోదం లేకుండా సాంకేతిక అంశాల్లో పూచిక పుల్లంత పనిజరిగేందుకు వీలులేదు. ఈ పానల్ కమిటీ ఆమోదం లేకుండా చిన్న నిర్మాణం జరిగే అవకాశంలేదు. 2019కి మునుపు ముంపుప్రాంతాల్లో నష్టపరిహారం పునరావాసం పూర్తి కానందుననే వరద ప్రవాహం దృష్టిలో పెట్టుకొని ఎగువ కాఫర్ డ్యాంలో రెండు గ్యాప్‌లు పూడ్చవద్దని ఆదేశించారు. 2019లో అధికారంలోనికి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2020లో వరద వచ్చేవరకు గ్యాప్‌లు పూడ్చనందున భారీ వరదకు డయాఫ్రమ్ వాల్ దెబ్బ తినింది. అదేవిధంగా ప్రాజెక్టు అథారిటీ ఒక దాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. బిల్లులు చెల్లింపు ప్రాజెక్టు పురోగతి నివేదికలను కేంద్రానికి పంపడం తదితర కర్తవ్యాలను అథారిటీ నిర్వర్తిస్తుంది.

ఇంత పకడ్బందీగా యంత్రాంగం ఏర్పాట్లు చేసిన కేంద్ర జలవనరులశాఖ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నాణ్యతతో కూడిన భద్రత ప్రమాణాలు పర్యవేక్షణకు క్వాలిటీ కంట్రోల్ అధికార విభాగాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదు? ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్నందున ఈ బాధ్యతను దానికే వదలి పెట్టిందా? చాల మందికీ గుర్తు వుండక పోవచ్చు. టిడిపి హయాంలో సాంకేతిక నిపుణుడు భార్గవ్ తరచూ పరిశీలనకు వచ్చేవారు. ఒక దఫా పరిశీలన సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు వున్నారా? ఎప్పటికప్పుడు నివేదికలు తయారు చేస్తున్నారా అని గట్టిగా నిలదీసిన సందర్భముంది. తర్వాత ఎప్పుడూ ఢిల్లీ నుండి వచ్చే నిపుణులు గాని, ప్రాజెక్టు అథారిటీ డ్యాం డిజైన్ రివ్యూ పానల్ కమిటీ ఏ సందర్భంలో కూడా క్వాలిటీ కంట్రోల్ విభాగం గురించి వాకబు చేసినట్లులేదు. ఇప్పుడు కూడా ప్రాజెక్టు నిర్మాణంలో ఈ విభాగం అధికారులు వుంటే ముందుగా వీళ్లు బోను ఎక్కవలసి వుంది.

సెల్: 9848394013

ఒక బుద్ధుడి మౌనముద్ర ప్రపంచాన్ని శాసించింది!

డాక్టర్ దేవరాజు మహారాజు

బుద్ధుడు వేదానికైనా, జాతికైనా, పౌరోహిత్యానికైనా, ఆచారానికైనా తల వంచని వాడు. సత్యాన్వేషణలో ఓ నిబ్బరం, దిట్టతనం ఉంచుకుని, సర్వ ప్రాణులపైన ప్రేమ, కరుణ కురిపించిన ఉన్నతమైన వ్యక్తి. అలాంటి వాడు ప్రపంచరంలో మరొకరు లేరు. నేను బుద్ధుడి సేవకుడికి సేవకుణ్ణి. అతనికి ముందుగానీ, వెనకాలగానీ ఎవరూ లేరు. ఆయన తన స్వంతానికి ఏమీ చేసుకోలేదు. ఎంతటి కరుణానిధీ? ఒక గొర్రెపిల్ల కోసం తన ప్రాణాన్ని ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. ఆకలితోఉన్న పులికోసం తనుసుతాను అర్పించుకోవడానికి సిద్ధమయ్యాడు. చండాలుడి ఆతిథ్యం సైతం స్వీకరించి ఆశీర్వదించాడు. మొత్తం ప్రపంచాన్ని కౌగలించుకునేంత అనుకంపనను అందించాడు. ఈ భూమి మీద జీవించిన శ్రేష్టమైనవారిలో బుద్ధుడు మిక్కిలి శ్రేష్టమైనవాడు. తనను ఒక మహా మానవుడిగా భావించి, అందరూ తనని ఆం ధించాలని ఆయనెప్పుడూ అనుకోలేదు. అది ఆయనకు ఇష్టంలేని పని కూడా.

–బుద్ధుడి గురించి స్వామి వివేకానంద
(వేరువేరు సందర్భాలలో చెప్పిన విషయాలు)

గౌతమ బుద్ధుడు సాధారణ శకానికి ముందు 563–483 బీసీఈ మధ్య జీవించిన వాడు. కపిలవస్తు సమీపంలోని లుంబిని వనంలో యువరాజు సిద్ధార్థగా జన్మించాడు. వీరిది శాక్య క్షత్రియ వంశం. శాక్య వంశీయుడు గనకనే తర్వాత కాలంలో శాక్యమునిగా పిలుచుకున్నారు. జ్ఞానోదయం అయిన తర్వాత బుద్ధుడయ్యాడు. బుద్ధుడు అంటే 'జ్ఞానోదయం' కలిగిన వాడు అని అర్థం! ఆయన బోధనల సారాంశమే 'బౌద్ధం' అయింది. ఒక వ్యక్తి మంచి జీవితం గడపడానికి బుద్ధుని బోధనలు ఉపయోగపడతాయి. లుంబిని వనం ప్రస్తుతం నేపాల్‌లో ఉంది. అది ఆ కాలంలో భారతదేశంలో అంతర్భాగం. సిద్ధార్థుడి తల్లి మహామాయ. ఈమె కొల్లియా యువరాణి. తండ్రి శుద్ధోధనుడు కపిలవస్తు రాజు. సిద్ధార్థుడికి చిన్నవయసులోనే యశోధరతో వివాహం జరిపిస్తారు. సిద్ధార్థ–యశోధర దంపతులకు 'రాహుల్' అనే కుమారుడు పుడతాడు. ఇరవై తొమ్మిదోఏట సిద్ధార్థుడు ఇంటిని త్యజించాడు. దానినే 'మహాభినిష్క్రమణం' అని అంటారు. రాజమందిరం వదిలి అడవిలో తిరుగుతున్నప్పుడే ఆయనకు అలరా కలామాతో పరిచయమైంది. అతనే సిద్ధార్థుడికి తొలి గురువు. ఆయనే ధ్యానం గురించి, సాంకేతిక పరిజ్ఞానం నేర్పించాడు. సిద్ధార్థుడు తన ముప్ఫయి అయిదవ ఏట నిరంజన నది ఒడ్డున బుద్ధ గయ వద్ద బోధివృక్షం కింద నలభై తొమ్మిది రోజులు ధ్యానం చేశాడు. నిరంతరాయంగా ఏకధాటిగా చేసిన ఆ ధ్యానం వల్ల, సిద్ధార్థుడికి జ్ఞానోదయమైంది. నిరంజన నదికి ఇప్పటి పేరు ఫల్గు. బుద్ధగయ బిహార్‌లో ఒకప్పుడు చిన్న గ్రామం. ఇప్పుడు అది ఒక పెద్ద బౌద్ధక్షేత్రమైంది. బుద్ధుడి వల్లనే గయకు బుద్ధగయ అనే పేరొచ్చింది. ఇప్పుడు అది జిల్లా కేంద్రం. మహాబోధి మందిరం, పద్మాలు పూసే సరస్సులూ అక్కడున్నాయి. మగధ విశ్వవిద్యాలయం కూడా అక్కడే ఉంది. బుద్ధుడికి జ్ఞానోదయమయ్యాక రెండు వందల ఏళ్లకు అశోక చక్రవర్తి ఆ స్థలాన్ని సందర్శించాడు. ఆ బోధి వృక్షం మొదట్లో ఒక వజ్రాసనాన్ని ఏర్పరచాడనీ అక్కడే ఒక మందిరం కట్టించాడనీ చెపుతారు. ఇప్పుడు అవి అక్కడ లేవుగానీ, వాటి అవశేషాలు మాత్రం తప్పక కనిపిస్తాయి.



భారతదేశంలో రెండు వేల ఆరువందల సంవత్సరాల క్రితం మతంగాకాక, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మార్గంగా బౌద్ధం ప్రారంభమైంది. బుద్ధుడు తనతొలి ఉపదేశం (బోధన), తన ఐదుగురు శిష్యులకు సారనాథ్‌లో చేశాడు. దీన్నే ధర్మచక్రం అంటారు. ఇది ఉత్తరప్రదేశ్‌లో ఉంది. ఇక్కడి ధమేక స్థూపం చాలా పెద్దది. ఇది సాధారణ శకం 500లో నిర్మాణమైంది. తెల్లని మకరానా పాలరాయితో నలభై మూడు మీటర్ల ఎత్తు నిర్మించారు. బుద్ధుడి ఐదుగురు శిష్యులపేర్లు –కౌండిన్య, అస్సాజి, భద్దియ, వప్పా, మహానామా. జ్ఞానోదయం అయిన తర్వాత బుద్ధుడు ఒక్కొక్క వారం ఒక్కొక్క చోట గడిపాడు. ఆ క్రమంలో ఏడవ వారం ఆగ్నేయంలో ఉన్న రాజాయతన వృక్షం కింద గడిపాడు. ఇక్కడ బుద్ధుణ్ణి ఇద్దరు బర్మా దేశపు వ్యాపారస్థులు కలిశారు. వారు ప్రార్థన రూపంలో బుద్ధుణ్ణి శరణు కోరారు. "బుద్ధం శరణం గచ్ఛామి' అని అన్నారు. అంటే నేను బుద్ధుణ్ణి శరణు కోరుతున్నాను అని అర్థం. అదే ఆ తర్వాత ప్రార్థనగా ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం బుద్ధగయలో అనేక మఠాలు, స్మారక కట్టడాలు, దేశంలోనే అతి పెద్ద బుద్ధ విగ్రహం ఉన్నాయి.

బౌద్ధంలో త్రి రత్నాలు అంటే మూడు ఆభరణాలు ఉన్నాయి. అవి ఏవంటే 1. బుద్ధుడు 2. ద్ధమ్మం 3. సంఘం. ఇవే బుద్ధం, శరణం గచ్ఛామి. ధర్మం శరణం గచ్ఛామి. సంఘం శరణం గచ్ఛామిగా మనకు తెలుసు. బుద్ధుడు నాలుగు గొప్ప సత్యాలు చెప్పాడు. 1. దు:ఖం – అంటే బాధ. అందులో నిజం ఉంది. బౌద్ధం ప్రకారం ప్రతిదీ బాధే. అందుకే 'సబ్బం దు:ఖం' అన్నారు. అంటే సర్వం దు:ఖమయమే అని అర్థం. ఇది నొప్పిని అనుభవించే సామర్థ్యాన్ని సూచిస్తుంది. ఒక వ్యక్తి అనుభవించే అసలైన నొప్పి–బాధ...దు:ఖం మాత్రమే! సముదాయబాధకు ఒక కారణం ఉంటుంది.

2. తృష్ణ (కోరిక) బాధకు ప్రధాన కారణం అదే. బాధ జీవితంలో ఒక భాగం. 3. నిరోధ- అంటే బాధకు ముగింపు. అందుకు అష్టాంగిక మార్గం ఉంది. 4. నిబ్బానా అంటే మోక్షం. దు:ఖాలకు అంతం. బాధలకు ముగింపు. బాధల ముగింపుకు అష్టాంగిక మార్గాలు ఉపయోగపడతాయి. అవి ఏవంటే...1. సమ్మాదిత్తి-సరైన అవగాహన 2. సమ్మ సంకల్ప-సరైన ఆలోచన 3. సమ్మ కమ్మంట-సరైన చర్య 4. సమ్మ అజీవ-సరైన జీవనోపాధి 5. సమ్మ వాయమా-సరైన ప్రయత్నాలు 6. సమ్మ వాకా-సరైన ప్రసంగం 7. సమ్మా సతి-సరైన బుద్ధి 8. సమ్మ సమాధి-సరైన ఏకాగ్రత బాధల ముగింపు ఎనిమిది విధాలుగానూ ఎనిమిది రెట్లుగానూ ఉంటుంది. సాధారణ శకానికి ముందు 483బీసీఈ లో బుద్ధుడు తన 80వ ఏట ఖుషీనగర్‌లో మరణించాడు. ఇది ఉత్తరప్రదేశ్‌లో ఒక పట్టణం. గోరక్‌పూర్‌కు తూర్పున 53 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇప్పుడది ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రం. ఇక్కడే బుద్ధుడు 'మహా పరినిర్వాణం' చెందాడని బౌద్ధం చెపుతుంది. బుద్ధుడు తన సిద్ధాంతాలలో మధ్యమ మార్గానికి ప్రాధాన్యమిచ్చాడు. అయితే బుద్ధుడి జనన మరణాల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. 563బిసిఇలో పుట్టాడని కొందరు చెపితే, లేదు 483 బిసిఈ అని మరికొందరంటారు. 483 బిసిఈలో పరినిర్వాణం చెందాడని కొందరంటే 400 బిసిఇ అని మరికొందరంటున్నారు. కొన్ని సంవత్సరాల తేడా ఉన్నా, అందరూ ఒప్పుకున్నది సాధారణ శకానికి ముందే అని! సంస్కృత భాషా ప్రభావంతో ఆయనపేర్లు-సిద్ధార్థుడు, గౌతముడుగా మారాయి. అసలైతే ఆనాటి పాలి భాషలో సిద్ధత్తా అని, గోటమా అని అనాలి. సంస్కృత ప్రభావంతోనే పాలి-పాళీ అయింది. ధమ్మం-ధర్మం అయింది.

సంస్కృత భాషమీద బ్రాహ్మణుల గుత్తాధిపత్యం ఉండేది. అందుకు విరుద్ధంగా బుద్ధుడు తన సందేశాల్ని ఆనాటి ప్రజల భాష అయిన పాలి భాషలో సరళంగా, మృదువుగా ప్రజలకు అందించేవాడు. అతని దయాగుణం, ప్రశాంత వదనం, సౌమ్య వచనం చక్రవర్తిగా రాజ్యమేలాల్సినవాడు, సర్వస్వాన్నీ త్యజించి, ప్రజలకోసం పరిత్యాగ జీవితం కోరుకున్న ఆయన ప్రజల్ని విశేషంగా ఆకర్షించేవాడు. ప్రజా సమస్యలకు ఆయన దగ్గర నైతిక పరిష్కారాలు సిద్ధంగా ఉండేది. తెరచిన పుస్తకం లాంటి ఆయన జీవితమే ఆనాటి నుండి ఈ నాటివరకు ప్రజలకు గొప్ప స్ఫూర్తినిస్తోంది. దేశంలోను, విదేశాలలోనూ బౌద్ధం గొప్పప్రజాదరణ పొందడానికి, కాలక్రమంలో బలహీనపడడానికీ అనేక కారణాలున్నాయి. అశోకచక్రవర్తి మద్దతుతో, చొరవతో మధ్య ఆసియా దేశాలలో, శ్రీలంకలో బౌద్ధం ఉచ్ఛస్థితికి చేరింది. తన తర్వాత రాజుకావల్సిన వాణ్ణి తన కుమారుడైన మహేంద్రను, కూతురు సంఘమిత్రను అశోకుడు బౌద్ధ ప్రచారం కోసం శ్రీలంకకు పంపాడు. ప్రసేన్‌జిత్, బింబిసారుడు, కనిష్కుడు మొదలైన రాజులు బౌద్ధాన్ని ఆదరించారు. రాజుల ప్రోత్సాహం, రాజపోషలకు కారణంగా ఆనాడు బౌద్ధం అనేక దేశాలక వేగవంతంగా వ్యాపించింది. బౌద్ధం వ్యాపించడానికి మరికొన్ని ముఖ్యకారణాలున్నాయి. వైదికధర్మం లాగా ఇది పిడివాదంగా లేదు. ఉదారవాదంగా ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఉండడం వల్ల అన్ని కులాలవారూ దీనిపట్ల ఆకర్షితులయ్యారు. పైగా మహిళలను కూడా సంఘంలో చేర్చుకోవడం వల్ల, బౌద్ధం అట్టడుగు హృదయాలను గెలుచుకుంది. ఆనాటి మగధలోని బ్రాహ్మణులు, శూద్రులను చిన్నచూపు చూసి అవమానించేవారు. అందువల్లకూడా, కులకట్టుబాట్లను తెంచుకుని అధిక సంఖ్యలో ప్రజలు బౌద్ధాన్ని అక్కున చేర్చుకున్నారు. వివేకవంతులైన కొందరు బ్రాహ్మణులు కూడా బౌద్ధం స్వీకరిస్తూ ఉండేవారు.

ఆ రోజుల్లోనే కాదు, ఆధునిక కాలంలో కూడా డా.బి.ఆర్. అంబేద్కర్ ఆరులక్షల మందితో బౌద్ధం స్వీకరించారు. ఈ దేశానికి ఒక దిశా నిర్దేశం చేశారు. దాన్ని 'నవయానం' అన్నారు. మొన్నటికీ మొన్న గుజరాత్‌లో 50వేల మంది బౌద్ధం స్వీకరించారు. మనుషులందరిదీ ఒకేస్థాయి-నైతికతే మనిషి వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది.

కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్రవేత్త.

కేరళలో వైద్యుడిపై దాడి

కొచ్చి: కేరళలో ఓ ప్రభుత్వ వైద్యుడిపై ఇద్దరు దాడి చేశారు. విచక్షణారహితంగా కొట్టారు. ఆ ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. తన సహచర వైద్యురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆ ఇద్దరిని అడ్డుకున్నందుకు డాక్టర్‌పై దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ ఇద్దరు డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో హౌస్ సర్జన్లుగా చేస్తున్నారు. నిందితులు తోయడంతో డాక్టరు కిందపడిపోయాడు. వైద్యుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువును చూడటానికి వచ్చామని నిందితులు జొస్నెయిల్, రాసన్ రాబిన్ చెప్పారు. దాడి సమాచారం అందిన వెంటనే పోలీసులు ఆసుపత్రికి వెళ్లారని, అప్పటికే నిందితులు పారిపోయారని పోలీసు అధికారి చెప్పారు. ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన సమాచారం, సీసీటీవీ దృశ్యాలు పరిశీలించిన తర్వాత నిందితులను గుర్తించామని, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

'నాక్' విద్యాసంస్థల్లో అగ్రభాగాన మహారాష్ట్ర

థానే : దేశంలోనే అత్యధిక సంఖ్యలో నాక్ గుర్తింపు పొందిన కళాశాలలు, విశ్వవిద్యాలయాలను మహారాష్ట్ర కలిగి ఉంది. ఇది నాణ్యమైన విద్య పట్ల రాష్ట్ర నిబద్ధతకు సూచన అని నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్‌కు చెందిన ఒక అధికారి తెలిపారు. శనివారం థానేలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నాక్ సలహాదారు డాక్టర్ దేవేందర్ కౌడే పీటీఐతో మాట్లాడారు. నాక్ అనేది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్వయంప్రతిపత్త సంస్థ, ముందుగా నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల ఆధారంగా ఉన్నత విద్యా సంస్థలను అంచనా వేయడానికి, అక్రిడిట్ చేయడానికి బాధ్యత వహిస్తుంది. మహారాష్ట్రలో 1,957 నాక్ అక్రిడిటేషన్లు ఉన్నాయని, అందులో 35 యూనివర్సిటీలు ఉన్నాయని, ఆ తర్వాత కర్నాటకలో 1,028 విద్యా సంస్థలు ఉన్నట్లు తెలిపారు. మిగతా అన్ని రాష్ట్రాలు 1,000 మార్కు కంటే తక్కువగా ఉన్నాయన్నారు. దక్షిణాదిలో మంచి సంఖ్యలో విద్యాసంస్థలు నాక్ అక్రిడిటేషన్లను కలిగి ఉన్నాయని ఆయన చెప్పారు. మే 19 నాటి స్థితి ప్రకారం, మొదటి రౌండ్‌లో 9,257 కళాశాలలు, 430 విశ్వవిద్యాలయాలు సహా మొత్తం 9,687 విద్యా సంస్థలకు నాక్ ట్యాగ్ ఇచ్చారు. వీటిలో 2,155 సంస్థలు ఏ, 6,370 సంస్థలు బీ, 1,162 సంస్థలు సీ గ్రేడ్‌లు పొందాయని తెలిపారు. రెండో రౌండ్‌లో 40 విశ్వవిద్యాలయాలు, 4,235 కళాశాలలు గుర్తింపు పొందాయని, మూడో రౌండ్‌లో 118 విశ్వవిద్యాలయాలు, 1,713 కళాశాలలు గ్రేడింగ్‌లు పొందాయన్నారు. నాల్గవది, ఇది 32 విశ్వవిద్యాలయాలు, 295 కళాశాలలు. ఇక ఐదవ రౌండ్‌లో ఒక కళాశాలకు మాత్రమే గుర్తింపు లభించిందని తెలిపారు. నాక్ గ్రేడింగ్ ఎప్పటికప్పుడు నవీకరణలతో కొనసాగుతుందని, గ్రేడేషన్ పొందేందుకు. దానిని నిర్వహించడానికి విద్యా సంస్థలు చాలా కృషి చేయాలని ఆయన అన్నారు. మహారాష్ట్రలో అధిక సంఖ్యలో నాక్ గుర్తింపు పొందిన కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్య పట్ల రాష్ట్ర నిబద్ధతను ప్రదర్శిస్తాయని, భారతదేశ ఆర్థిక వృద్ధి ఉన్నత విద్యా వ్యవస్థ అభివృద్ధికి దగ్గరి సంబంధం కలిగి ఉందని తెలిపారు.

రూ.1.61 లక్షల కోట్లు దాటిన జీఎస్‌టీ వసూళ్లు

న్యూఢిల్లీ : జూన్‌లో జీఎస్‌టీ వసూళ్లు 12 శాతం పెరిగి రూ.1.61 లక్షల కోట్లు దాటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. ఆరేళ్ల క్రితం జులై 1, 2017న పరోక్ష పన్ను విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి స్థూల జీఎస్‌టీ వసూళ్లు నాలుగోసారి రూ.1.60 లక్షల కోట్ల మార్కును అధిగమించాయి. 2021-22, 2022-23, 2023-24 మొదటి (ఏప్రిల్-జూన్) త్రైమాసికానికి సగటు నెలవారీ స్థూల జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రూ.1.10 లక్షల కోట్లు, రూ.1.51 లక్షల కోట్లు, రూ.1.69 లక్షల కోట్లుగా ఉన్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. 'జూన్ 2023 నెలలో సేకరించిన స్థూల జీఎస్‌టీ ఆదాయం రూ.1,61,497 కోట్లు. ఇందులో కేంద్ర జీఎస్‌టీ రూ.31,013 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీ రూ.38,292 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.80,292 కోట్లు (దిగుమతిపై సేకరించిన వస్తువులు రూ.39,035 కోట్లతో సహా). సెస్ రూ.11,900 కోట్లు (వస్తువుల దిగుమతిపై వసూలు చేసిన రూ.1,028 కోట్లతో సహా)' అని ప్రకటన తెలిపింది. జూన్ 2023కి వచ్చే ఆదాయాలు గత ఏడాది ఇదే నెలలో వచ్చిన జీఎస్‌టీ ఆదాయాల కంటే 12 శాతం ఎక్కువ. నెలలో, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చే ఆదాయాలు (సేవల దిగుమతితో సహా) గత ఏడాది ఇదే నెలలో ఈ వనరుల నుంచి వచ్చిన ఆదాయాల కంటే 18 శాతం ఎక్కువ. ఏప్రిల్‌లో ఆదాయాలు రికార్డు స్థాయిలో రూ.1.87 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మే నెలలో ఇది రూ.1.57 లక్షల కోట్లుగా ఉంది.

వంట నూనెల ఉత్పత్తిలో
స్వీయ సమృద్ధి సాధించాలి

- అందుకు సహకార సంఘాలు, రైతులు కృషిచేయాలి
- సేద్యం, అన్నదాత కోసం ప్రభుత్వ వార్షిక ఖర్చు రూ.6.5లక్షలకోట్లు
- సహకార సంఘాల సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వ్యవసాయం, రైతుల కోసం తమ ప్రభుత్వం ఏటా రూ.6.5లక్షలకోట్లు ఖర్చు చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. నూనె గింజలు, పప్పుల ఉత్పత్తిని పెంచుకోవాలని, వంట నూనెల ఉత్పత్తిలో స్వీయసమృద్ధిని సాధించాలని, ఇందుకోసం రైతులు, సహకార సంఘాలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న లక్ష్యంతో సహకార రంగాన్ని బలోపేతం చేసుకోవాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కార్పొరేట్ రంగాన్ని పోలిన వేదిక సహకార సంఘాలకు కల్పిస్తున్నట్లు తెలిపారు. పన్ను రేట్లలో తగ్గుదల వంటి చర్యలను సహకార రంగాభివృద్ధికి చేపడుతున్నట్లు వెల్లడించారు. మోదీ 17వ భారతీయ సహకార సంఘాల సదస్సులో మాట్లాడుతూ రాజకీయాలకు బదులు సామాజిక, జాతీయ విధానాలను సహకార సంఘాలు ప్రోత్సహించాలని, పారదర్శకతకు, అవినీతి రహిత పరిపాలనకు నమూనాగా ఉండాలని అన్నారు. డిజిటల్ పద్ధతులను పెద్దఎత్తున అనుసరించి లబ్ధి పొందాలని సూచించారు. డిజిటల్ ఇండియా గుర్తింపును ప్రస్తావించారు. పారదర్శకతను పెంచి లబ్ధిదారులకు ప్రయోజనాలు అందేలా హామీనిచ్చినట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయి లేక పీఏసీఎస్‌లోని ప్రధాన సహకార సంఘాలు పారదర్శకతకు నమూనాలుగా ఉండాలని ఆకాంక్షించారు. ఇప్పటికే 60వేలకుపైగా పీఏసీలు కంప్యూటీకరణ జరిగినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సహకార సంఘాలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవా లని, తద్వార బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల మాధ్యమంగా సహకార సంఘాలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. చెరకు రైతుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ రైతుల రుణాలను చెల్లించేందుకు రూ.20వేల కోట్ల ప్యాకేజిని చక్కెర మిల్లులకు ఇచ్చినట్లు మోదీ తెలిపారు. ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడానికి ప్రాధాన్యత ఇస్తుండటంతో తొమ్మిదేళ్లలో మిల్లుల నుంచి రూ.70వేల కోట్ల విలువ చేసే ఇథనాల్ కొనుగోలు చేశామని చెప్పారు. ఆహార భద్రత గోదుమ, ధాన్యానికి పరిమితం కాకూడదన్నారు. నూనె, పప్పులు, మత్స్య ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ తదితరాలపై రూ.2లక్షల కోట్ల నుంచి రూ.2.5లక్షలకోట్ల వరకు భారత్ వెచ్చిస్తోందని మోదీ తెలిపారు. నవభారత ఆర్థిక వ్యవస్థకు శక్తిమంతమైన సాధనంగా సహకార సంఘాలు ఉంటాయన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. కోఆపరేటివ్ మోడల్‌ను అనుసరించి స్వీయ సమృద్ధి సాధన కోసం గ్రామాల నిర్మాణం జరగాలని మోదీ అన్నారు. ప్రతి రైతుకు రూ.50వేల వార్షిక ఆదాయానికి తమ ప్రభుత్వం హామీనిస్తోందని, ఇందుకు అనేక మార్గాలను అనుసరిస్తోందని మోదీ అన్నారు. 'ఇది మోదీ హామీ. చేసిందే చెబుతున్నా, వాగ్దానం చేయడం లేదు' అని ప్రధాని ఉద్ఘాటించారు. కేవలం హామీలు ఇవ్వడం లేదని, వాటిని ఆచరిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలనుద్దేశించి అన్నారు. పండించిన పంటకు ఎంఎస్‌పీ రూపేణ తొమ్మిదేళ్లలో రైతులకు రూ.15లక్షల కోట్లు ఇచ్చామని, ఎరువుల సబ్సిడీ కోసం రూ.10లక్షలకోట్లు ఖర్చు చేయగా అంతర్జాతీయ ధరలు పెరిగినాగానీ పంట పోషకాలను సముచిత ధరలకే రైతులకు తమ ప్రభుత్వం అందించిందని మోదీ తెలిపారు. యూరియా బస్తా రూ.270కి ఇస్తున్నామని, అదే బంగ్లాదేశ్‌లో రూ.720, పాకిస్తాన్‌లో రూ.800, చైనాలో రూ.2,100, అమెరికాలో రూ.3వేలకుపైగా పలుకుతోందన్నారు. నాలుగేళ్లలో రూ.2.5లక్షల కోట్లను పీఎం కిసాన్ పథకం కింద నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. 2014కి ముందు ఐదేళ్ల వ్యవసాయ బడ్జెట్ రూ.90వేల కోట్ల కంటే తక్కువగా ఉన్న క్రమంలో ఈ మొత్తం ఎంత ఎక్కువో మీరు అర్థం చేసుకోగలరని మోదీ అన్నారు. తమ తొమ్మిదేళ్ల పాలనలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో గొప్ప విజయాలు సాధించినట్లు మోదీ చెప్పుకున్నారు. పీఎం-కిసాన్ పథకాన్ని ప్రస్తావించారు. చవకగా ఎరువులు ఇస్తున్నట్లు తెలిపారు. సగటుగా ఏటా రూ.6.5లక్ష కోట్లను వ్యవసాయం, రైతుల కోసం తమ ప్రభుత్వం ఖర్చు పెడుతోందని అన్నారు.

బస్సు టైరు పేలడం కారణం కాదు
బుల్డానా ప్రమాదంపై ఆర్టీవో నివేదికలో వెల్లడి

అమరావతి : సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేపై శనివారం నాటి బస్సు ప్రమాదానికి టైరు పేలడం కారణం కాదని, సంఘటనా స్థలంలో రబ్బరు ముక్కలు లేదా టైరు గుర్తులు లేవని అమరావతి ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్‌టీవో) తన నివేదికలో పేర్కొంది. ఈ దుర్ఘటనలో 25 మంది ప్రయాణికులు మరణించారు. ప్రాణాలతో బయటపడిన వారి సంఖ్య ఆధారంగా రూపొందించిన ఆర్‌టీవో నివేదిక, ప్రమాద స్థలిలో ఎటువంటి ఆధారం (పగిలిన తర్వాత టైర్ల రబ్బరు ముక్కలు) లేదా టైరు గుర్తులు లేవని, ఇంపాక్ట్ మార్కింగ్ వీల్ డిస్క్‌పై ఉందని, అది వంగి ఉందని, టైరు పైన కాదని వెల్లడించింది. నాగ్‌పూర్ నుంచి పూణేకు సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై 33 మంది ప్రయాణికులతో వెళుతున్న బస్సు బుల్డానాలోని సింధ్‌ఖేడ్రజాలో తెల్లవారుజామున 1.32 గంటలకు బోల్తా పడి మంటలు చెలరేగడంతో 25 మంది ప్రయాణికులు మరణించారు. ప్రాణాలతో బయటపడిన వారిలో ఒకరు అందించిన వివరాల ప్రకారం, బస్సు రోడ్డుకు కుడివైపున ఉన్న ఉక్కు స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను ఢీకొట్టిందని నివేదిక పేర్కొంది. ముందు టైర్ డివైడర్‌ను ఢీకొట్టిన ప్రభావం చాలా తీవ్రంగా ఉందని, ఇది బస్సు ఛాసిస్ నుంచి ఫ్రంట్ యాక్సిల్ అసెంబ్లింగ్‌ను ఛిద్రం చేయడానికి కారణమైందని, డీజిల్ ట్యాంక్ ఉన్న వాహనం కుడివైపు మళ్లీ డివైడర్‌ను ఢీకొట్టిందని, ఆ ప్రభావం బస్సు బాడీని చీల్చిందని వెల్లడించింది. ఫ్రంట్ యాక్సిల్ అసెంబ్లీ స్థానభ్రంశం చెందిన తర్వాత, బస్సు ముందు భాగం రోడ్డును తాకడంతో ఏర్పడిన ఘర్షణ వేడి, మంటలను సృష్టించింది. (బస్సు ఆన్ మోడ్‌లో ఉన్నందున ఇంజిన్ ఆయిల్ ఉష్ణోగ్రత కూడా ఎక్కువగా ఉంది) నివేదిక పేర్కొంది. ముందు ఇరుసు లేకపోవడంతో వాహనం లాగడంతో ఎడమవైపు బోల్తా పడటంతో మంటలు ఎక్కువయ్యాయి. బస్సు ప్రయాణికుల ప్రవేశ ద్వారం-నిష్క్రమణ ద్వారాన్ని అడ్డుకుంది. ప్రమాదం కారణంగా వాహనం అమరిక కోల్పోవడంతో ఎమర్జెన్సీ డోర్ పనిచేయకుండా పోయిందని వెల్లడించింది. బస్సు రాత్రి 11:08 గంటలకు ఎక్స్‌ప్రెస్‌వేలోకి ప్రవేశించిందని, 152 కిలోమీటర్ల దూరంలో అర్ధరాత్రి 1:32 గంటలకు ప్రమాదం జరిగిందని, అంటే బస్సు సగటు వేగం గంటకు 70 కిలోమీటర్లుగా ఉందని నివేదిక పేర్కొంది.

బస్సు అద్దాలు పగులగొట్టి బయటపడ్డాం

- బుల్డానా దుర్ఘటన నుంచి బాధితులు
- కళ్లముందే కాలిపోతున్నా ఏమీ చేయలేకపోయాం : స్థానికులు

నాగపూర్ : మహారాష్ట్రలోని బుల్డానా జిల్లాలో శనివారం 25 మంది ప్రయాణికుల మరణానికి దారితీసిన బస్సు దుర్ఘటన నుంచి ప్రాణాలతో బయటపడిన వారిలో కొందరు మంటల్లో కాలిపోతున్న బస్సు కిటికీ అద్దాలను పగులగొట్టి బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నామని తెలిపారు. నాగ్‌పూర్ నుంచి పూణేకు వెళుతున్న ప్రైవేట్ స్లీపర్ కోచ్ బస్సు, సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేపై సింధ్‌ఖేడ్‌రాజా సమీపంలోని పింపాల్‌ఖుటా గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదానికి గురైంది. బస్సులో ప్రయాణిస్తున్న 33 మంది ప్రయాణికుల్లో 25 మంది సజీవదహనమయ్యారని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్, క్లీనర్ సహా మరో ఎనిమిది మంది ప్రాణాలతో బయటపడ్డారు. డివైడర్‌ను ఢీకొట్టిన తర్వాత బస్సు బోల్తా పడి కుడివైపు ప్రవేశ/ఎగ్జిట్ డోర్ ఆకాశానికి వైపు పడిపోయిందని వారు తెలిపారు. 'బస్సు టైరు పగిలి వెంటనే వాహనంలో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే మంటలు వ్యాపించాయి' అని ప్రాణాలతో బయటపడిన వారిలో ఒకరు తెలిపారు. 'నా పక్కన కూర్చున్న ప్రయాణీకుడు, నేను వెనుక కిటికీని పగలగొట్టడం ద్వారా తప్పించుకోగలిగాము' అని అతను వివరించాడు. ప్రమాదం జరిగిన తర్వాత పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది త్వరితగతిన ఘటనాస్థలికి చేరుకున్నారని ప్రాణాలతో బయటపడిన వ్యక్తి తెలిపాడు. ప్రాణాలతో బయటపడిన మరో వ్యక్తి ఆయుష్ ఘట్గే ఈ ఘోర ప్రమాదం నుంచి బయటపడడం ఓ అద్భుతం అన్నారు. నాగపూర్‌లోని పారిశ్రామిక శివారు ప్రాంతమైన బుటిబోరి వద్ద తాను బస్సు ఎక్కినట్లు తెలిపారు. 'ప్రమాదం జరిగినప్పుడు నేను చివరి సీటులో ఉండి నిద్రపోతున్నాను. ప్రమాదం తర్వాత కొంతమంది నాపై పడడంతో నేను మేల్కొన్నాను. నేను వెంటనే లేచి బయటకు రావడానికి కిటికీ కోసం వెతకడం ప్రారంభించాను. నేను కిటికీని పగలగొట్టడం మొదలుపెట్టాను. మేము ముగ్గురం ఒకరి సహాయంతో బయటికి వచ్చాము' అని ఘట్గే చెప్పారు. ప్రమాదంలో మరణించిన అవనీ పోహ్నేకర్ బంధువులు ఒక టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ ఐటీ ఇంజనీర్ అయిన ఆమె ఉద్యోగ అవకాశాలను అన్వేషించడానికి పూణేకు వెళుతుందని చెప్పారు. 'ఆమె వార్ధా నుంచి పూణే వెళుతోంది. వార్ధా నుంచి ఈ బస్సు ఎక్కిన 14 మంది ప్రయాణికులలో అవని కూడా ఉన్నారని మేము తరువాత గుర్తించాము' అని వారు వివరించారు. నలుగురైదుగురు ప్రయాణికులు బస్సు కిటికీని పగులగొట్టి తప్పించుకున్నారని స్థానికుడు ఒకడు తెలిపారు. 'కానీ అందరూ చేయలేరు' అని అతను అన్నాడు. బస్సు నుంచి బయటకు వచ్చిన వ్యక్తులు తరువాత మాకు చెప్పారు. వారు హైవేపై ఇతర వాహనాల నుంచి సహాయం కోరినప్పటికీ ఎవరూ ఆపలేదని అన్నారు. 'పింపాల్‌ఖుటా వద్ద ఈ హైవేపై చాలా ప్రమాదాలు జరుగుతాయి. మేము సహాయం కోసం పిలిచాము. మేము అక్కడికి వెళ్లినప్పుడు మేము భయంకరమైన పరిస్థితిని చూశాము. టైర్లు వేరుగా పడిపోయాయి' అని స్థానిక నివాసి వివరించారు. 'లోపల ఉన్న వ్యక్తులు కిటికీలను పగలగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజలు సజీవ దహనం కావడం మేము చూశాము. అగ్ని చాలా తీవ్రంగా ఉంది. మేము ఏమీ చేయలేము. మేము కన్నీళ్లతో ఉన్నాము' అని అన్నారు. హైవే గుండా వెళ్లే వాహనాలను సహాయం కోసం నిలిపి ఉంటే, మరింత మంది ప్రాణాలను కాపాడేవారని తెలిపారు. శుక్రవారం రాత్రి విదర్భ ట్రావెల్స్ బోర్డింగ్ పాయింట్ వద్ద తన సోదరుడిని దింపినట్లు యవత్మల్‌లోని గోంధి గ్రామానికి చెందిన 23 ఏళ్ల నిఖిల్ పాతే మరణించిన ప్రయాణీకుడి అన్నయ్య హర్షద్ పాతే మీడియాకు తెలిపారు. 'మా అన్నయ్య పూణెలో ఉద్యోగం కోసం వెళుతున్నాడు. కానీ అది అతని అంతిమ యాత్రగా మారింది' అని అన్నారు.

సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేపై ప్రమాదాల నివారణకు చర్యలు
మహారాష్ట్ర సీఎం హామీ

నాగపూర్ : బుల్డానా బస్సు దుర్ఘటనలో 25 మంది మరణించిన ఘటనను తమ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని, నాగ్‌పూర్-ముంబై సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శనివారం హామీ ఇచ్చారు. శనివారం తెల్లవారుజామున ప్రమాదం జరిగిన బుల్డానా జిల్లాలోని పింపాల్‌ఖుటా గ్రామాన్ని షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సందర్శించారు. పోలీసు సిబ్బంది, జిల్లా పరిపాలన అధికారులు, స్థానిక నివాసితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు విషాద క్రమాన్ని వారికి తెలియజేశారు. ఘటనా స్థలంలో షిండే విలేకరులతో మాట్లాడుతూ అన్ని వాహనాల డ్రైవర్లు వేగ పరిమితికి సంబంధించిన నిబంధనలను పాటించాలని అన్నారు. సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేలో ఇప్పటివరకు మానవ తప్పిదాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరిగాయని, అయితే ఈ ప్రమాదాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని ప్రమాదాలు, పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునే ముందు నిపుణులతో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఈరోజు జరిగిన ప్రమాదంలో 25 మంది మృతి చెందడం దురదృష్టకరమని, బస్సు డోర్ లాక్ కావడంతో వారిని రక్షించలేకపోయామని, ఎనిమిది మంది బయటకు రాగలిగారని షిండే తెలిపారు. త్వరితగతిన స్పందించే వాహనాలు, అగ్నిమాపక దళం, ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న పోలీసులు సమయానికి సంఘటనా స్థలానికి చేరుకున్నారని తెలిపారు.

7న బ్రిజ్ భూషణ్‌పై అభియోగాల విచారణ

న్యూఢిల్లీ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనే దానిపై ఢిల్లీ కోర్టు మంగళవారం తీర్పును జులై 7వ తేదీకి వాయిదా వేసింది. శనివారం ఉత్తర్వులు జారీ చేయాల్సిన అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఏసీఎంఎం) హర్జీత్ సింగ్ జస్పాల్... దాని దర్యాప్తు ఇంకా పురోగతిలో ఉందని, అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని నగర పోలీసుల వాదనను గుర్తించారు. అయితే, ఎఫ్ఎస్ఎల్ నివేదిక, సీడీఆర్ (కాల్ డిటెయిల్ రికార్డ్) పై నివేదిక కోసం వేచి ఉన్నందున దీనికి సమయం పట్టే అవకాశం ఉంది. జులై 7వ తేదీకి పరిశీలనకు పెట్టాలని న్యాయమూర్తి ఆదేశించారు.

ఆర్టికల్ 370పై సత్వర విచారణ
సీజేఐకి మెహబూబా ముఫ్తీ విజ్ఞప్తి

జమ్ము: ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లపై సత్వరమే విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు పీఈడీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ శనివారం విజ్ఞప్తి చేవారు. 2019 ఆగస్టు 5వ తేదీన జమ్మకాశ్మీరులో 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన విషయం విదితమే. సీజేఐ ప్రస్తుతం జమ్మకశ్మీరులో పర్యటిస్తున్నారు. శ్రీనగర్‌లో 19వ ఆల్ ఇండియా లీగల్ సర్వీసెస్ అథారిటీస్ సమావేశాన్ని ప్రారంభించారు. దీనితోపాటు జమ్ములో నూతన హైకోర్టు కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. 'సీజేఐ డీవై చంద్రచూడ్‌కు మేము స్వాగతం పలుకుతున్నాం. ఆర్టికల్ 370 అంశాన్ని ఆయనకు గుర్తుచేయాలని కోరుకుంటున్నాం. ఎలాంటి అరమరికలు లేకుండా మెజారిటీ ముస్లిం ప్రాంతం భారత్‌లో కలవడానికి అంగీకరించినందుకు జమ్మకశ్మీరుకు ప్రత్యేకహోదా కల్పించారు' అని ముఫ్తీ ఇక్కడ విలేకరుల సమావేశంలో గుర్తు చేశారు. 370వ అధికరణపై సత్వరమే విచారణ ప్రారంభించాలని సీజేఐకి విన్నవిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన పిటిషన్లు నాలుగేళ్లుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రం కోసం పోరాటం చేసిన వేలాదిమంది యువత ఎలాంటి విచారణ లేకుండా జమ్మకశ్మీరు లోపల, బయట జైళ్లలో మగ్గుతున్నారని చెప్పారు. జమ్మకశ్మీరుకు ప్రత్యేకహోదా కల్పించే ఆర్టికల్ 370 రద్దును పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ), నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), ఇతర పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సంపత్ ప్రకాశ్(1968), విజయలక్ష్మి ఝా(2018), ప్రేమ్‌నాథ్ కౌల్(1959) దాఖలు చేసిన కేసుల్లో సుప్రీంకోర్టు అనేక తీర్పులు ఇచ్చినప్పటికీ ఆర్టికల్ 370ని బీజేపీ రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధం. చట్టవ్యతిరేకమని మెహబూబా విమర్శించారు. జమ్మకశ్మీరు రాజ్యాంగ అసెంబ్లీ సిఫార్సు లేకుండా ఆర్టికల్ 370ని ముట్టుకోకూడదని ఆమె పునరుద్ఘాటించారు.

ఎన్నికల కోసమే ఉమ్మడి పౌరస్మృతి
హిమాచల్ మంత్రి విక్రమాదిత్య విమర్శ

సిమ్లా: ఎన్నికలకు ముందు వివాదాస్పద అంశాలను తెరపైకి తీసుకురావడం బీజేపీ వ్యూహంలో భాగమేనని హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర మంత్రి విక్రమాదిత్య సింగ్ శనివారం విమర్శించారు. నిరుద్యోగం, వృద్ధిరేటు క్షీణత వంటి కీలక అంశాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బీజేపీ చేస్తున్న ఉద్దేశపూర్వక ప్రయత్నమని ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆరోపించారు. ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిన సమయాన్ని ఆయన ప్రశ్నించారు.

గడచిన 9 ఏళ్లుగా సంపూర్ణ మెజారిటీతో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఆ సమయంలో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విక్రమాదిత్య వివరించారు. ఎన్నికల లబ్ధి కోసమే ఇప్పుడు ఆ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇంతకుముందు కూడా పౌరసత్వ సవరణ చట్టం నుంచి ప్రజల దృష్టి మళ్లించడం, ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి పుల్వామా ఉగ్రదాడి, ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిరం వంటి అంశాలను బీజేపీ లేవనెత్తిందని ఆరోపించారు. హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రతిభాసింగ్ తనయుడే విక్రమాదిత్య సింగ్. ఆయన తండ్రి వీరభద్రసింగ్ ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 'ఉమ్మడి పౌరస్మృతి బిల్లు ఎప్పుడు తీసుకొచ్చినా మేము మద్దతిస్తాం. దేశ సమగ్రత, సమైక్యతకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. ఆ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతుగా నిలుస్తుంది' అని విక్రమాదిత్య చెప్పారు. 'దేశంలో ప్రస్తుతం చాలా సమస్యలు ఉన్నాయి. రెండు మాసాలుగా మణిపూర్ మండుతోంది. ముఖ్యమంత్రిపైనా కనీసం చర్యలు తీసుకోలేదు. ఎమర్జెన్సీ ప్రకటించలేదు లేదా గవర్నరు పాలన విధించలేదు. ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితి ఎదురైతే మోదీ సర్కారు మౌనంగా ఉండేదా?' అని ఆయన ప్రశ్నించారు.

వెంటనే లొంగిపోండి
తీస్తా సెతల్వాద్‌కు హైకోర్టు బెయిల్ నిరాకరణ

అహ్మదాబాద్: హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు గుజరాత్ హైకోర్టు శనివారం బెయిల్ నిరాకరించింది. 2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసుల్లో సాక్ష్యాధారాలను సృష్టించారని నమోదైన కేసులో ఆమెకు రెగ్యులర్ బెయిలు మంజూరు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆలస్యం చేయకుండా లొంగిపోవాలని ఆమెను ఆదేశించింది. 2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీని, మరికొందరిని ఇరికించేందుకు తీస్తా సెతల్వాద్ ప్రయత్నించారని కేసు నమోదైన సంగతి తెలిసిందే. మోదీ, తదితరులను కేసుల్లో ఇరికించేందుకు ఆమె విస్తృత స్థాయి కుట్రకు పాల్పడినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. అహ్మదాబాద్ డిటెన్షన్ ఆఫ్ క్రైమ్ బ్రాంచ్ ఈ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఆమెతోపాటు సహ నిందితుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌బీ శ్రీకుమార్‌ను గుజరాత్ పోలీసులు గత ఏడాది జూన్ 25న అరెస్టు చేశారు. ఏడు రోజుల పోలీస్ రిమాండ్ తర్వాత జులై రెండున జ్యుడిషియల్ కస్టడీకి ఆమెను తరలించారు. అయితే గత ఏడాది సెప్టెంబరులో ఆమెకు సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిలు మంజూరు చేసింది. దీంతో ఆమె జ్యుడిషియల్ కస్టడీ నుంచి విడుదలయ్యారు. తనకు సాధారణ బెయిలు మంజూరు చేయాలని తీస్తా సెతల్వాద్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. ఆమెకు బెయిలు మంజూరు చేయవద్దని గుజరాత్ ప్రభుత్వం హైకోర్టును కోరింది. తప్పుడు సాక్ష్యాలు సృష్టించినట్లు ఆమె ఆరోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపింది. కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ నుంచి ఆమె రూ.30 లక్షలు తీసుకున్నారని తెలిపింది. 2002లో జరిగిన అల్లర్ల తర్వాత నరేంద్ర మోదీ నేతృత్వంలోని గుజరాత్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే లక్ష్యంతో ఈ సొమ్మును అయన ఆమెకు ఇచ్చారని తెలిపింది. గుజరాత్‌ను అపఖ్యాతిపాలు చేయాలనే లక్ష్యంతో ఓ రాజకీయ నేతకు ఆయుధంగా ఆమె వ్యవహరించారని ఆరోపించింది. గుజరాత్ అల్లర్లలో అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, తదితరుల ప్రమేయం లేదని ప్రత్యేక దర్యాప్తు బృందం క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ జకియా జాఫ్రీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సుప్రీంకోర్టు జకియా పిటిషన్‌ను గత ఏడాది జూన్ 24న తోసిపుచ్చింది. ఆ మర్నాడే తీస్తా సెతల్వాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్ హైకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమీన్ వాదనలు వినిపిస్తూ 2002లో గోధ్రా రైలు దుర్ఘటన తర్వాత జరిగిన అల్లర్ల వెనుక భారీ కుట్ర ఉందని ప్రచారం చేసేందుకు, అప్పటి గుజరాత్ ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు తీస్తా సెతల్వాద్, పోలీసు అధికారులు శ్రీకుమార్, సంజీవ్ భట్ కుట్ర పన్నారని ఆరోపించారు. ఆమెకు బెయిలు మంజూరు చేయరాదని కోరారు.

తీస్తా సెతల్వాద్ బెయిలు దరఖాస్తును గత ఏడాది జులైలో సెషన్స్ కోర్టులోనూ రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. తీస్తాకు గతంలో సన్నిహితంగా వ్యవహరించిన రయీస్ ఖాన్ ఇచ్చిన వాంగ్మూలాన్ని ప్రస్తావించింది. అహ్మదాబాద్ సర్క్యూట్ హౌస్‌లో కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్, తీస్తా సెతల్వాద్ సమావేశమయ్యారని ఖాన్ ఆ వాంగ్మూలంలో చెప్పినట్లు తెలిపింది. కొందరిని కటకటాల వెనుకకు నెట్టే విధంగా చూడాలని సెతల్వాద్‌ను పటేల్ ఆదేశించినట్లు ఖాన్ చెప్పారని వివరించింది. పటేల్ ఆమెకు రూ.30 లక్షలు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపింది. తీస్తా మొదట్లో మాజీ హోం మంత్రి హరేన్ పాండ్యా తండ్రి విఠల్ భాయ్ పాండ్యాను సంప్రదించారని, అల్లర్లతో సంబంధం లేనివారికి వ్యతిరేకంగా ఆరోపణలు చేయబోనని ఆయన చెప్పడంతో జకియా జాఫ్రిపై దృష్టి పెట్టారని తెలిపింది. జస్టిస్ నిర్జర్ దేశాయ్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం తీర్పు చెప్తూ తీస్తా సెతల్వాద్ బెయిలు దరఖాస్తును డిస్మిస్ చేసింది. ఆలస్యం చేయకుండా వెంటనే లొంగిపోవాలని ఆమెను ఆదేశించింది. ఈ తీర్పును 30 రోజులపాటు నిలిపివేయాలని సీనియర్ న్యాయవాది మిహిర్ ఠాకూర్ హైకోర్టును కోరారు.

నిర్వాసితులు త్యాగధనులు

- వారికి పరిహారం లేదు... పునరావాసం లేదు
- పాలకుల నిర్లక్ష్యంపై రామకృష్ణ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: నిర్వాసితుల త్యాగఫలమే పోలవరం ప్రాజెక్టు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఎం అధ్వర్యంలో నిర్వహిస్తున్న నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్రకు సంఘీభావం తెలిపిన రామకృష్ణ శనివారం ఏలూరు బహిరంగ సభలో మాట్లాడారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ సభకు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు ఇల్లు, భూమి, ఉపాధి లేకుండా పోయిందన్నారు. 2020కి పోలవరం పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి జగన్ చెప్పి నాలుగేళ్లు అయిందన్నారు. మంత్రులు, మేధావులు, రాజకీయ పార్టీలు నిర్వాసితుల సమస్యలపై మాట్లాడాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 26 జిల్లాలు సస్యశ్యామలమవుతాయని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి, కోస్తా జిల్లాల ఆయకట్టు స్థిరీకరణకు, విశాఖ పారిశ్రామిక అవసరాలకు, తాగునీరు, 7.20 లక్షల ఎకరాలకు ప్రత్యక్షంగా సాగునీరు అందుతుందన్నారు. కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం వలన రాయలసీమకు నీరు అందించవచ్చన్నారు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో రాష్ట్రంలో నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పోలవరం మొదలై దశాబ్ద కాలం గడిచినా ఇళ్లు, పరిహారం, ఉపాధి చూపించలేదన్నారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం రూ.30 వేల కోట్లు కేంద్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీని నిధులు అడిగే పరిస్థితిలో జగన్ లేరని, కేసులకు భయపడి జగన్ మౌనం వహిస్తున్నారని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా కేంద్రం నుంచి ఏమీ సాధించలేమన్నారు. రాష్ట్రంలో రివర్స్ పాలన సాగుతోందన్నారు. పోలవరం నిర్వాసితుల కోసం బీజేపీ రాష్ట్ర నాయకులు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. నిధులు ఇవ్వకుండా పోలవరం జపం చేస్తే ఓట్లు పడవని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని, అవసరమైతే కేంద్రం మెడలు వంచడానికి దిల్లీలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

మోదీనా...ప్రజలా...తేల్చుకో: శ్రీనివాసరావు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాసితులు పదేళ్లుగా వేచిచూసి విసిగిపోయారని, ప్రభుత్వాలతో తాడోపేడో తేల్చుకోవడానికి పాదయాత్ర చేస్తున్నారన్నారు. నిర్వాసిత గ్రామాలను పూర్తిగా గాలికి వదిలేశారన్నారు. ఇప్పటికే పోర్టులు, రోడ్లు వంటి వాటిని మింగేస్తున్న అదానీ...జీలుగుమిల్లిలో ఆయుధ ఫ్యాక్టరీ పెట్టడానికి ముందుకొచ్చారన్నారు. ఈ మండలంలో ఆరెకరాలు సేకరించి నిర్వాసితుల కోసం కాలనీలు కడుతున్నారని, పరిహారం ఇవ్వకపోవడంతో 20 శాతానికి మించి కుటుంబాలు రాలేదన్నారు. నిర్వాసితుల సమస్య పరిష్కరించకుండా ప్రాజెక్టును ఏవిధంగా కడతారని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం గురించి మాట్లాడే ముఖ్యమంత్రి జగన్‌కు నిర్వాసితుల సంక్షేమం పట్టదా అని ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న వారిని ఆదుకుని భరోసా కల్పించాలన్నారు. నిధులన్నీ కాంట్రాక్టర్లు, మంత్రులు, నాయకులు పంచుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ స్వయంగా పర్యటించి వైసీపీ నాయకులను అడిగి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ప్రజల ఆశీస్సులు కావాలో, మోదీ ఆశీస్సులు కావాలో జగన్ తేల్చుకోవాలన్నారు. ఈనెల 4న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహా పాదయాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు బేబి, బీఎస్పీ నాయకులు నేతల రమేశ్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు తదితరులు ప్రసంగించారు. టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి బడేటి చంటి పాదయాత్రలో పాల్గొన్నారు. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ స్వాగతం పలుకుగా సీపీఎం నాయకులు బి సోమయ్య వందన సమర్పణ చేశారు. బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, కంచర్ల గురవయ్య, జేవీ రమణ రాజు, జిల్లా సమితి సభ్యులు తొర్లపాటి బాబు, ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, వి.ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10 వరకు ఎస్సీ, బీసీ హాస్టళ్ల సర్వే

- 12న ప్రభుత్వం దృష్టికి సమస్యలు
- జాన్సన్‌బాబు, శివారెడ్డి వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలపై ఈనెల 1 నుండి 10వ తేదీ వరకు సర్వేలు చేస్తామని, తాము గుర్తించిన సమస్యలపై 12వ తేదీన స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివా రెడ్డి తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 30వ తేదీన జరిగిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశంలో విద్యార్థుల సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై అనేక తీర్మానాలు చేశామని జాన్సన్‌బాబు, శివారెడ్డి తెలిపారు. హాస్టల్ మెనూ చార్జీలు పెంచినా...మెస్ బిల్లులు పెంచలేదని విమర్శించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, వెనుకబడిన హాస్టళ్లలో సర్వే నిర్వహించి...ఈనెల 18న కలెక్టరేట్ల వద్ద నిరసన తెలుపుతామన్నారు. అమ్మ ఒడి నిధులను తల్లుల ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలన్నారు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందజేయాలని, విద్యా ర్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర సమితి తీర్మానాలను నాయకులు వివరించారు. డిగ్రీ కోర్సులో మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని వ్యతిరేకిస్తూ పాత పద్ధతిలోనే మూడేళ్ల డిగ్రీ కోర్సులు కొనసాగించాలని జులై 3న రాష్ట్రవ్యాప్త ధర్నాలు చేయాలని నిర్ణయించామన్నారు. మూడేళ్ల డిగ్రీపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వమే అవగాహన కల్పించి... వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఉచితంగా ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని తీర్మానించారు. కేజీబీవీ పాఠ శాలల సీట్ల సంఖ్య పెంచాలని, పట్టణాలలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాలలో సీట్ల సంఖ్య పెంచాలని, యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయిం చాలని తీర్మానించినట్లు నాయకులు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఓబులేసు, షేర్ మస్తాన్, ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

మళ్లీ దిల్లీకి జగన్

5న ప్రధాని మోదీతో భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మరోమారు దిల్లీ బాట పట్టారు. ఆయన ఈనెల 4వ తేదీన దేశ రాజధానికి బయల్దేరి వెళతారు. ఆ మరుసటి రోజు ప్రధాని మోదీతో భేటీ అవుతారు. ఆ మేరకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఖరారైనట్లు అధికారవర్గాలు తెలిపాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు మరికొందరు కేంద్రమంత్రులను జగన్ కలవనున్నారు. వివేకా హత్య కేసులో సీబీఐ తాజా చార్జిషీట్ నేపథ్యంలో జగన్ దిల్లీ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, దానిపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పీఎస్‌బీల లాభాలు రూ.1.04 లక్షల కోట్లు

తొమ్మిదేళ్లలో మూడు రెట్ల పెంపు: సీతారామన్

న్యూదిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) లాభాలు తొమ్మిదేళ్లలో మూడు రెట్లు పెరిగి రూ.1.04లక్షలకోట్లకు చేరాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పీఎస్‌బీల నికర లాభం 2014లో రూ.36,270 కోట్లుగా ఉంటే ప్రస్తుతం రూ.1.04లక్షలకోట్లకు పెరిగిందని, ఇదే రీతిలో కొనసాగించడం ఆర్థిక వ్యవస్థకు అవసరమన్నారు. పంజాబ్, సింద్ బ్యాంకు కార్పొరేట్ కార్యాలయాన్ని సీతారామన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అద్భుత కార్పొరేట్ పాలన సిద్ధాంతాలను అనుసరించడం ద్వారా బ్యాంకులు అద్భుతంగా రాణించాలని అన్నారు. 'బ్యాంకులు తమ విజయాలను చూసుకొని మురిసిపోతూ ఉండరాదు. అద్భుత కార్పొరేట్ పాలనా విధానాలను అనుసరించాలి. రెగ్యులేటరీ నిబంధనలకు కట్టుబడాలి. ద్రవ్య నిర్వహణను సమర్థంగా నిర్వహించాలి. ఆస్తి-రుణం, రిస్క్ మేనేజ్‌మెంట్‌కు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి' అని సీతారామన్ సూచించారు. ట్విన్ బ్యాలెన్స్‌షీట్ సమస్య స్థాయి నుంచి ట్విన్ బ్యాలెన్స్‌షీట్ ప్రయోజనాల స్థాయికి ఆర్థిక వ్యవస్థ చేరుకుందన్నారు. ట్విన్ బ్యాలెన్స్‌షీట్ సమస్యను పరిష్కరించగలగడం హర్షణీయమని చెప్పారు. పీఎస్‌బీల లాభాలు మూడు రెట్లు పెరిగిన వేళ బ్యాంకులు పుంజుకొనేలా చూడటం తమ కర్తవ్యమన్నారు. మోదీ ప్రభుత్వ 4ఆర్ వ్యూహం సత్ఫలితాలు ఇచ్చిందని సీతారామన్ చెప్పారు. ఇదే క్రమంలో పంజాబ్, సింద్ బ్యాంకు గురించి మాట్లాడుతూ 1947లో విభజన సమయంలో ఈ బ్యాంకు తీవ్రంగా ప్రభావితమైందని గుర్తుచేశారు. పది శాఖల్లో రెండు మాత్రమే భారత్‌లో మిగిలాయని, మిగతావి పాకిస్తాన్‌లోకి వెళ్లాయని చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఈ బ్యాంకు శాఖలు 1,553 ఉంటే 1,554వ శాఖ అసోంలోని కరీంగంజ్‌లో కొత్తగా ప్రారంభమైందని సీతారామన్ తెలిపారు.

ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలి

6న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాను జయప్రదం చేయండి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం జులై 6న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్ బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక హనుమాన్ పేటలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను, అలాగే, రైతు భరోసా కేంద్రాలలో ఖాళీగా ఉన్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా డీఎస్సీ ప్రకటించకపోవడంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది నిరుద్యోగ యువత లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కోచింగ్ సెంటర్లలో ఎదురుచూస్తున్నారని, డీఎస్సీ రాదేమో అనే భయాందోళనలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించాలని, గ్రూప్-1, గ్రూప్-2 పోస్టు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ పేపర్లకే పరిమితమైందని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాత పరీక్షలు పూర్తి చేసుకుని అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ మానస పుత్రిక అయిన గ్రామ సచివాలయాలలో రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేని పరిస్థితుల్లో నిరుద్యోగులకు నెలకు రూ.10 వేల నిరుద్యోగ భృతి ఇవ్వడంతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించాలని డిమాండ్ చేశారు. సీఎం ఎన్నికల సమయంలో 'నేను ఉన్నాను-నేను విన్నాను', 'మాట తప్పను-మడమ తిప్పను' అంటూనే నిరుద్యోగుల విషయంలో మాట తప్పి, మడమ తిప్పారని, నిరుద్యోగుల గోస సీఎంకు వినిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల 35 వేల ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టులు భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, అధికారులు వ్యవహరిస్తూ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయకపోగా, క్లస్టర్ల పేరుతో ఇన్‌ఛార్జ్‌లను నియమించి గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగానికి సేవలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. తక్షణమే పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం జులై 6న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు, నగర కార్యదర్శి బెవర శ్రీను, నాయకులు షేక్ అలీ, కాళ్ల విజయ్, లాల్మోహన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి జరగాలి

- నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధితోనే ఏ రాష్ట్రమైన ఆర్థికంగా అభివృద్ధి చెంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని, ప్రస్తుతం రాష్ట్రంలో అందుకు విరుద్ధమైన పాలన జరుగుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. శనివారం ఇక్కడ ఆంధ్ర ప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షులు నేతి మహేశ్వరరావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలకు అనుకూలమా-ప్రతికూలమా అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన వనజ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందని, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో యువత పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లి పని చేస్తున్నారని తెలిపారు. యువత, రైతులు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. రాబోయే కాలంలో అయినా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉండే విధంగా నిర్ణయాలు జరగాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ భౌగోళికంగా, మానవ వనరుల పరంగా, మార్కెట్ పరంగా దేశంలోనే మంచి వాతావరణం కలిగి ఉందని తెలిపారు. గొప్ప గొప్ప వ్యాపార దిగ్గజాలని అందించిన ఈ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టము అనే పరిస్థితి నెలకొందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోదీకి దాసోహమై ప్రైవేటీకరణను సమర్థిస్తున్నారని విమర్శించారు. అమరావతిని చంపడం ద్వారా రైతులకే కాకుండా రాష్ట్రానికి నష్టం చేశారన్నారు. లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రానికి మూలధనాన్ని అధిక ప్రాధాన్యత ఇచ్చేదిగా ఉండాలని, మౌలిక సదుపాయాల కల్పన జరగాలన్నారు. గొప్ప రాజధాని నిర్మాణం జరిగినప్పుడే ఆదాయం పెరిగి, ఆర్థిక లోటు భర్తీ అవుతుందని, ఉద్యోగ, ఉపాధి కల్పనతో యువత వలసలు తగ్గుతాయని అన్నారు. ప్రజా చైతన్యం, ప్రజా ఉద్యమం ద్వారా ఈ రాష్ట్రాన్ని అందరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అమరావతిని చంపేయటం వలనే నేడు ఈ దుస్థితి కారణం అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ కక్షపూరిత ధోరణి వల్ల రాజధాని అమరావతి నిర్మాణం కోసం అప్పటి వరకు ఖర్చు పెట్టిన రూ.3 వేల కోట్లు నిరుపయోగం అయ్యాయని తెలిపారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ వ్యాపార అనుకూల వాతావరణం భయానకంగా తయారైందని విమర్శించారు. గత ప్రభుత్వ ఒప్పందాలను రివర్స్ టెండరింగ్ పేరుతో రద్దు చేయడంతో సంస్థలు రాష్ట్రం వీడి వెళ్లిపోయాయని తెలిపారు. నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ ఏపీలో పరిశ్రమలు పెట్టాలంటే భయపడుతున్నారని, అన్ని రకాల వనరులు ఉన్నా పరిశ్రమలు రావడం లేదని తెలిపారు. ప్రభుత్వాలు మారితే విధానాలు మారే పరిస్థితి ఒక్క ఏపీలోనే ఉందన్నారు. పరిశ్రమలు రాకుండా అధికారులే అడ్డుకునే పరిస్థితి నెలకొందన్నారు. పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సీఎం దృష్టి పెట్టాలని, లేకుంటే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బహుజన సమాజ్ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎంతమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణం జరిగి ఉంటే రాష్ట్ర భవిష్యత్ మరోలా ఉండేదన్నారు. ఎన్నో పరిశ్రమలతో కళకళలాడాల్సిన అమరావతిని ఎడారిగా మార్చారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి లంక దినకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలనుకొండ శివాజీ, చెవుల కృష్ణాంజనేయులు, గాళ్ల సుబ్రమణ్యం, బొప్పన రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించాలి

మణిపూర్‌లో నిరసన ప్రదర్శనలు

ఇంఫాల్: జాతీయ పౌర నమోదు (ఎన్ఆర్‌సీ) ని అమలు చేయాలని, సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం మణిపూర్‌లోని ఇంఫాల్ లోయ ప్రాంతంలో అనేక చోట్ల ప్రజలు ప్రదర్శనలు నిర్వహించారు. ఇంఫాల్ తూర్పు జిల్లా ఖురాయ్‌లో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించే ప్రయత్నాన్ని నిరసిస్తూ పెద్ద సంఖ్యలో మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి బీరెన్ ఎన్ సింగ్‌కు తమ మద్దతును ప్రకటించారు. అసోంలోని కచార్ జిల్లా సరిహద్దులో ఉన్న జిరిబామ్ జిల్లాలో మహిళలు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు రాజీనామా చేయవద్దని కోరుతూ ర్యాలీ చేపట్టారు. అలా చేస్తే ఉగ్రవాదుల ముందు లొంగిపోయినట్లే పేర్కొన్నారు. తాను పదవికి రాజీనామా చేయడం లేదని బీరెన్ ఎన్ సింగ్ స్పష్టం చేసిన ఒక రోజు తర్వాత ఈ ప్రదర్శనలు జరిగాయి. ఈశాన్య రాష్ట్రంలో మైతేయి, కుకీ సామాజిక వర్గాల మధ్య జరిగిన జాతి హింసలో ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

వన్డే ప్రపంచకప్ అర్హత కోల్పోయిన విండీస్

ముంబై: ప్రపంచ క్రికెట్‌లో వెస్టిండీస్‌కు ఘోర పరాభవం ఎదురైంది. వన్డే ప్రపంచకప్‌కు అర్హత కోల్పోయింది. 1975, 1979లో వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ సాధించిన విస్టిండీస్.. తాజాగా వన్డే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించలేని జట్టుగా నిలిచిపోయింది. శనివారం జరిగిన సూపర్ సిక్స్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో స్కాట్‌లాండ్‌పై 7 వికెట్ల తేడాతో ఓటమిపాలవ్వడంతో వన్డే ప్రపంచకప్‌లో ఆడే అవకాశాన్ని విస్టిండీస్ కోల్పో యింది. 48 ఏళ్లలో వన్డే ప్రపంచకప్‌కు విస్టిండీస్ అర్హత సాధించకపోవడం ఇదే తొలిసారి. స్కాట్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 43.5 ఓవర్లలో 181 పరుగులు చేసి ఆలౌటయ్యింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ప్రత్యర్థి 42.3 ఓవర్లలో మరో 7 వికెట్లు మిగిలుండగానే విజయం సాధించింది.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.